ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

శనివారం 28 సెప్టెంబరు 2024 | 5





ఇసుగెత్తి.. పోతున్నారు!



- త్రిశంకు స్వర్గంలో ఉచిత ఇసుక
- ప్రభుత్వం ప్రకటించినా అందని వైనం
- పట్టువీడని నాయకులు.. అధికారులు..
- ఇసుక కొరతతో ఆగిన భవన నిర్మాణాలు
- ఆన్‌లైన్ అమలులో ఉన్నా ఇసుక తీయని వైనం

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఇసుక కష్టాలు తీరడంలేదు.. గోదావరి తగ్గుముఖం పట్టినా ఇసుక తీత ఆరంభంకాలేదు.. నేడు రేపు అంటూ నెట్టుకొస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నప్పటికీ జిల్లాలో అధికారులు, ప్రజాప్రతినిధుల వైఖరి వల్ల ప్రజలకు ఇసుక దొరకని పరిస్థితి ఏర్పడింది. ఈ నెల 11 నుంచి ఆన్‌లైన్ విధానం అమల్లోకి వచ్చినా జిల్లాలో ఇంత వరకూ ఇసుక సరఫరా ఆరంభించలేదు. నిబంధనలు కఠినంగా అమలు చేయాలని అధికార యంత్రాంగం, తమ పార్టీ శ్రేణులకు కనీస ఆదాయం అయినా రప్పించాలని ప్రజా ప్రతినిధులు భీష్మించుకుని కూర్చోవడంతో సమస్య జఠిలంగా మారింది. అధికారుల మధ్య సమన్వయ లోపం కనిపిస్తోంది. దీంతో జిల్లాలో ఇసుక కొరత తీవ్రమైంది. ఇంత వరకూ వరదల వల్ల ఆలస్యమైతే ఇపుడు నిబంధనలు, పట్టుదల వల్ల ఆలస్యమవుతోంది. ఇదిలా ఉంటే అధికారికంగా ఆర్డర్ ఇవ్వనప్పటికీ కొవ్వూరు మండలం ఆరికరేవులలో రెండు ర్యాంపుల్లో ఇసుక గుట్టలు పెడుతున్నారు. గోదావరిలో ఇసుక ఇష్టానుసారం తవ్వేస్తున్నా రు. జిల్లాలో ఇసుక తీయడానికి 9 డీసిల్టేషన్ పాయింట్లు గాయత్రిలో రెండు,కోటిలింగాల ఒకటి, కొవ్వూరు వైపు 6 గుర్తించారు. ఈ పాయింట్లలో ఇసుక తీయడానికి 48 బోట్స్‌మన్ సొసైటీలను గుర్తించారు.ఇందులో అధికార కూటమి శ్రేణులకు సంబంధించినవే ఎక్కువ ఉన్నట్టు సమాచారం. ఈ సారి ఇసుక సరఫరాపై గట్టి నిఘా పెడుతున్నారు. ప్రతి రోజు ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ ఇసుక రీచ్‌ల వద్దకు వాహనాలను అనుమతిస్తామన్నారు. అక్రమ ఇసుక రవాణా అరికట్టడానికి వీలుగా వినియోగదారుడి వివరాల ఆధారంగా క్రాస్ చెక్ చేసే వ్యవస్థను అమల్లోకి తెచ్చారు.సీసీ కెమెరాలుఏర్పాటు,బయోమెట్రిక్ గుర్తింపు వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నారు.

రవాణా చార్జీలిలా!

- **ట్రాక్టర్ :** ర్యాంపు నుంచి 10 కిలోమీటర్ల వరకూ 4.5 టన్నుల ఇసుక ట్రాక్టర్‌కు రూ.13.5లు రవాణా చార్జీగా నిర్ణయించారు. తర్వాత 11 నుంచి 20 కిలోమీటర్ల వరకూ రూ.12.8, 21 నుంచి 30 కి.మీ వరకూ రూ.12.8, 31 నుంచి 40 వరకూ రూ.12.8, 40 నుంచి 80 కి.మీ వరకూ రూ.6.3 మాత్రమే వసూలు చేస్తారు.
- **10 టన్నుల ఇసుక ఆరు టైర్ల ట్రక్కు :** ఇసుక పాయింట్ నుంచి 10 కిలోమీటర్ల రూ.10.7, 11 నుంచి 20 కిలోమీటర్ల వరకూ రూ.10.2 , 21 నుంచి 30 కిలోమీటర్ల వరకూ 10.2 రూపాయలు, 31 నుంచి 40 వరకూ రూ.10.2, 40 నుంచి 80 కిలోమీటర్ల వరకూ 6.3 రూపాయలు వసూలు చేయాలన్నారు.
- **10, 12, 14 టైర్ల లారీలు :** 18 టన్నులు, 20 టన్నులు, 25 టన్నులు,30 టన్నులు, 35 టన్నుల ఇసుక తీసుకుని వెళ్లినా పాయింట్ నుంచి 10 కిలోమీటర్ల వరకూ కిలోమీటరు రూ.9.4, 11 నుంచి 20 కిలోమీటర్ల వరకూ రూ.8.9, 21 నుంచి 30 కిలోమీటర్ల వరకూ రూ.8.9, 31 నుంచి 40 కిలోమీటర్ల వరకూ రూ.8.9, 40 నుంచి 80 కిలోమీటర్ల వరకూ రూ.6.3 వసూలు చేయాలి.ఇక 80 కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరం ఉంటే కిలోమీటరుకు రూ.35 అదంగా వసూలు చేయవచ్చని నిర్ణయించారు.

10 టన్నుల ఇసుక రూ.3600

ఇసుక తవ్వకం, లోడింగ్ రూ.30, రీలోడింగ్‌కు రూ.30, సీనరేజి రూ.66, జీఎస్టీ 18 శాతం, డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ (డీఎంఎఫ్) రూ.19.68, మెరిట్(ఖనిజాన్వేషన్ నిధి) 2 శాతం వసూలు చేస్తారు. లబ్ధిదారుడు రవాణా చార్జీలు పెట్టుకోవాలి. ర్యాంపుల్లో ఒక పైసా కూడా అదనంగా తీసుకోవడానికి వీలులేదు. కొందరు రవాణా చార్జీల పేరిట ఎక్కువ వసూలు చేస్తున్నట్టు స్టాక్ పాయింట్లలో తేలడంతో రవాణా చార్జీలను ప్రభుత్వమే నిర్ణయిస్తూ జీవో జారీ చేసింది. ఆ ప్రకారమే వాహనదారులు ఇసుకను సరఫరా చేయాలి.దీంతో 10 టన్నుల లారీ ఇసుక రూ. 3600 అవుతుంది. ప్రస్తుతం డీసిల్టేషన్ వల్ల ఈ ధర ఎక్కువ కనిపిస్తోంది. ఓపెన్ ర్యాంపులు మొదలైతే బోట్స్‌మన్ సొసైటీలకు ఇచ్చే డబ్బులు మిగులుతాయి. ధర తగ్గుతుంది.

దీని పేరు ఏడీబీ రోడ్డు.. ఈ పేరు వింటే అమ్మో అనక మానరు.. ఎందుకంటే ఎక్కడ రోడ్డుందో.. ఎక్కడ గొయ్యుందో తెలియదు.. గత ఐదేళ్లగా ఇంతే. ఈ రోడ్డులో ప్రయాణికులు ప్రత్యక్ష నరకమే చూస్తున్నారు.. అయినా నేటికీ తీరు మారలేదు.. ఇప్పటికీ పడుతూ.. లేస్తూ వెళ్లాల్సిందే మరి..ఈ చిత్రంలోనే ఒక గోతిలో కారు ఎలా మునిగిందో.. కూటమి ప్రభుత్వంలోనైనా రోడ్డు పడుతుందని ఆశగా ఎదురుచూస్తున్నారు.. - రాజానగరం



ఇవీ రోడ్లేనా!?



జిల్లా వ్యాప్తంగా రహదారులు దారుణంగా ఉన్నాయి.. ఎటు వెళ్లినా ఇంతే.. వెళుతుంటే చింతే.. ప్రధాన రహదారి అయినా.. గ్రామాల్లో అయినా దారిద్ర్యమే.. గత ఐదేళ్లలో వైసీపీ పాలకులు రోడ్లను పట్టించుకోవడమే మానేశారు.. దీంతో మరీ అధ్వానంగా తయారయ్యాయి. నిత్యం రద్దీగా ఉండే రాజానగరం - సామర్లకోట ఏడీబీ రోడ్డు ఉందా అంటే ఉంది అంతే.. వెళ్లడానికి పనికొస్తుందా అంటే కాస్త ఆలోచించాల్సిందే మరి.. జిల్లా కేంద్రంలో రహదారుల సంగతి ఏంటా అంటే.. అక్కడా అంతే మరి.. మండల కేంద్రాల్లో బాగున్నాయా అంటే అదీ లేదు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ఎక్కడ చూసినా ఇవీ రోడ్లేనా అనక మానరు మరి..!?

ఇదే మా హెచ్చరిక?

ప్రస్తుతం రోడ్లపై చూసుకుని వెళ్లకపోతే అంతే.. ఎందుకంటే రోడ్లు అలా ఉన్నాయి మరి.. గత ఐదేళ్లగా వైసీపీ ప్రభుత్వంలో పట్టించుకోకపోవడంతో నేడు రోడ్లన్నీ గోతులతో నిండి అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. ఈ చిత్రంలోనే చూడండి..ఈ రోడ్డు ఎక్కడి దో తెలుసా.. కొవ్వూరు డివిజన్ కేంద్రానికి చేరువగా ఉన్న తాళ్లపూడి మండలం కేంద్రంలో ప్రధాన రహదారి.. అయినా ఇంతే. చాలా కాలంగా ఇక్కడ గొయ్యి ఉంది.. అధికారులు పట్టించుకోకపోవడంతో పెరిగి పెద్దదైపోయింది.. ఈ గొయ్యి గురించి తెలియక చాలా మంది ప్రమాదానికి గురయ్యారు.. అధికారులకు ఫిర్యాదు చేసినా కనీసం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపో వడంతో స్థానికులే ఇలా కర్రపెట్టి హెచ్చరిక చేస్తున్నారు. అయ్యా అధికారులు ఇకనైనా మేల్కొండి మరి.. - తాళ్లపూడి

నగరం.. అందునా జిల్లా కేంద్రం.. రోడ్లన్నీ సాఫీగా ఉంటాయనుకుంటే పొరబడినట్టే మరి.. చూసుకుని వెళ్లకపోతే పాతాళానికి పడిపోతారు.. కనిపించకుం డాపోతారు..ఈ చిత్రంలోనే చూశారా.. ఇదెక్కడిదో గమనించారా..! షెల్టాన్ హోటల్ సమీపంలో రోడ్డు.. అక్కడ ఇటువంటి గొయ్యి చూడలేదే అనుకుంటున్నారా.. చిన్న చినుకు పడినా చాలు ఇటువంటి గోతులు బోలెడన్ని బయటపడతాయి.. ఎందుకంటే గతంలో మన మునిసి పల్ అధికారులు పనులు అంత నాణ్యతగా చేసి పైన తారుపూశారు మరి.. రాజమహేంద్రవరం శీలం నూకరాజు కాంప్లెక్స్ - షెల్టాన్ రోడ్డులో ఎస్టీపీ ప్లాంట్ కు వెళ్లే మురుగునీటి పైప్‌లైన్ పగిలి శుక్రవారం సాయంత్రం రోడ్డు కుంగింది. దీంతో ఈ అగాధం కాస్తా బయటపడింది.. ఏ అర్ధరాత్రి సమయంలో మంచి వర్షం పడుతుండగా ఇలా జరిగి ఉంటే అంతే సంగతి మరి.. ఈ పైప్‌లైన్‌కు గతంలో బైపాస్‌రోడ్డు జంక్షన్ నుంచి గోరక్షణపేట వైపు వెళ్లే ప్రధాన మార్గంలో పగిలి చాలా వరకు రోడ్డు కుంగిపోయింది. అప్పట్లో రోజుల తరబడి రిపేరుచేసి రోడ్డును ఇంత అందంగా పూడ్చారు. - రాజమహేంద్రవరం సిటీ



నాట్యమయూరాలు.



పర్యాటకరంగ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులతో కలెక్టర్ ప్రశాంతి

పర్యాటక అభివృద్ధికి కృషి : కలెక్టర్

దివాన్‌చెరువు, సెప్టెంబరు 27 : పర్యాటక అభివృద్ధికి పాటుపడదామని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పిలుపునిచ్చారు.ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఆదికవి నన్నయ వర్శిటీలో శుక్రవారం సాయంత్రం జరిగిన జిల్లాస్థాయి కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. రాజహేంద్రవరం నగరానికి ఎంతో చారిత్రక ప్రసిద్ధి ఉందని.. దీనిని పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పర్యాటకశాఖ ప్రాంతీయ డైరెక్టర్ వి.స్వామినాయుడు మాట్లాడుతూ అఖండ గోదావరి ప్రాజెక్టులో భాగంగా రూ. 100 కోట్లతో పురుషోత్తమపట్నం, బ్రిడ్జిలంక, కడియంలలో ఎకో టూరిజం, క్రూజ్‌టూరిజం, అడ్వెంచర్ టూరిజం ప్రతిపాదించామన్నారు. వివిధ పోటీల్లో విజేతలకు కలెక్టర్ బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో వర్శిటీ వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు, జిల్లా పర్యాటక అధికారి పి.వెంకటాచలం, రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, కామర్స్ విభాగాధిపతి ఎస్.ఉదయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



ముంచిన వాన

వానొచ్చింది.. ముంచేసింది.. జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఉదయం ఒక్కసారిగా వానొచ్చిపడింది.. సుమారు మూడు గంటల పాటు ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో పల్లపుప్రాంతాలు జలమయమయ్యాయి. ఉదయమే వర్షం కురవడంతో పాఠశాలలకు వెళ్లే చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రాజమహేంద్రవరంలో పలు వీధులు కాలువల్లా మారిపోయాయి. సీపీఐ నాయకులు ముంపు ప్రాంతాను పరిశీలించారు. -రాజమహేంద్రవరం అర్బన్

చిరుత..ఎక్కడున్నావ్! 7

జిల్లా దేవాదాయ అధికారిగా నాగేశ్వరరావు



రాజమహేంద్రవరం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా దేవాదాయ అధికారి (డీఈవో)గా రాజ మహేంద్రవరం కార్యాలయంలో కె.నాగేశ్వర రావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ ఉప కమిషనర్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తూ పదోన్నతిపై ఇక్కడికి బదిలీ అయ్యారు.ఈ స్థానంలో ఉన్న వి.సోమరాజు ఉప కమిషనర్ కార్యాలయ సూపరింటెండెంట్‌గా వెళ్లారు.కార్యక్రమంలో జిల్లా ఎండోమెంట్ ఆఫీస్ సూపరింటెండెంట్ శ్రీనివాసా చార్యులు, అర్చక సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా నిబంధనలు మీరితే జైలుకే : ఎస్పీ

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అనుమతులు పొందినవారు మాత్రమే నిబంధనలకు లోబడి బాణసంచా తయారీ, విక్రయాలు నిర్వహించాలని ఎస్పీ నరసింహ కిశోర్ పేర్కొన్నారు. ఉల్లంఘనలకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ మేరకు పటిష్ట నిఘా పెట్టామని, విస్తృతంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. బాణసంచా గోదాములు, దుకాణాలు, తయారీ కేంద్రాలు నివాస ప్రాంతాలకు నిర్దేశించిన దూరంలో ఉండాలన్నారు. ముందస్తు జాగ్రత్తలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా అనుమతుల్లేకుండా రహస్య బాణాసంచా తయారీ, నిల్వ, విక్రయాలపై 112కి డయల్ సమాచారం ఇవ్వాలన్నారు.

స్కూల్ బస్.. ఫిట్‌లెస్!

అనపర్తిలో స్టీరింగ్ ఫెయిల్.. త్రుటిలో తప్పిన పెనుప్రమాదం

అనపర్తి, సెప్టెంబరు 27 : స్కూల్ బస్‌కు త్రుటిలో పెనుప్రమాదం తప్పింది.ఫిట్‌నెస్ ఎంత ఫిట్‌లెస్‌గా ఉందనేది తెలియజేసింది.. మండపేటలోని ఒక ప్రైవేట్ కళాశాలకు చెందిన బస్సు శుక్రవారం రాత్రి ఏడుగురు విద్యార్థులతో అనపర్తి రైల్వే ఫ్లయ్ ఓవర్ మీదుగా బాబా నగర్ వైపు వస్తుంది.అయితే బస్సు స్టీరింగ్ ఫెయిల్ కావడంతో బస్సు ఒక్కసారిగా అదుపుతప్పి ఫుట్‌పాత్ మీదుగా రెయిలింగ్‌ను ఢీకొట్టి ఆగింది. అప్పటికే బస్సు దిగేందుకు ప్రయత్నిస్తున్న విద్యార్థి ఒక్కసారిగా వెనుకకు బస్సులో పడడంతో ప్రమాదం తప్పింది.అదే ముందుకు పడి ఉంటే పెద్ద ప్రమా దమే జరిగేది. సమాచారం అందుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు అక్కడికి చేరుకుని తమ పిల్లలు క్షేమంగా ఉన్నారని తెలుసుకుని ఊపిరి పీల్చుకున్నారు.కండీషన్‌లో లేని బస్సులతో విద్యా ర్థుల ప్రాణాలతో చెలగాటమాడ తారా అంటూ విద్యార్థుల తల్లిదం డ్రులు ఆందోళన వ్యక్తం చేశారు.సమాచారం అందుకున్న ఎస్ఐ శ్రీను నాయక్ అక్కడికి చేరుకుని విద్యార్థుల వివరాలు తెలుసుకున్నారు. కండీషన్ సరిగా లేని స్కూల్ బస్సులపై ఆర్‌టీఏ అధికారులు చర్య లు తీసుకోవాలని కోరుతున్నారు.



రెక్కలు..ముక్కలు..

పంకా పక్కచూపులు

- కూటమి వైపు నాయకుల చూపు
- ఇప్పటికే పలువురి ప్రయత్నం
- సైలెంట్‌గా ఉన్న ప్రధాన నేతలు
- మాజీ ఎంపీ భరత్ కినుక
- నిడదవోలులో ముక్కలైన కౌన్సిల్
- చైర్మన్ తీరుపై తీవ్ర అసహనం
- రాజీనామా చేయాలని డిమాండ్
- వైసీపీ కౌన్సిలర్ల వాకౌట్
- ఇంకా ఆరంభంకాని ఆకర్ష్
- అదే జరిగితే వైసీపీ ఖాళీ

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

వైసీపీ నాయకులు కూటమి వైపు చూస్తున్నారు.. ప్రధాన నాయకులు పార్టీ మారేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు.. గేట్లు తెరిస్తే చాలు జంప్ అవ్వడానికి సిద్ధంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో వైసీపీకి భారీ షాక్ తగలనుంది. ఇప్పటికే కొందరు పార్టీ మారగా, ప్రస్తుతం రాజమహేంద్రవరం మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో పలువురు మాజీ కార్పొరేటర్లు, వైసీపీ నేతలు పార్టీ మారనున్నారు. వైసీపీ మాజీ కార్పొరేటర్లు, నాయకులు సుమారు 15 మంది వరకూ గురువారం రాత్రి జనసేన రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జి అనుశ్రీ(అత్తి) సత్యనారాయణను కలసి తాము జనసేనలో చేరడానికి సిద్ధంగా ఉన్నట్టు చెప్పడం గమనార్హం. మాజీ కార్పొరేటర్లు మానే దొరబాబు, 21వ డివిజన్ సత్యనారాయణ, నేతలు మజ్జి అప్పారావు, నరవ గోపాలకృష్ణ, మంచాల బాబ్జి ఇంకా పలువురు మాజీ కార్పొరేటర్లు ఉన్నట్టు సమాచారం. మంత్రి దుర్గేష్, అధినేత పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లి చేరికలపై నిర్ణయం తీసుకుంటామని అనుశ్రీ సత్యనారాయణ చెప్పినట్టు ప్రచారం జరుగుతోంది. దీనిపై వైసీపీలో తీవ్ర చర్చనీయాంశమైంది. జిల్లా వైసీపీ అధ్యక్షుడిగా మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు శనివారం బాధ్యతలు స్వీకరించనున్న సమయంలో పలువురు వైసీపీ నేతలు, మాజీ కార్పొరేటర్లు జనసేనలో చేరడానికి ముందుకు రావడం చర్చనీయాంశమైంది. ఇతర నేతల్లో కూడా సంతృప్తి లేదు.జిల్లాలో కీలకనేత, వైసీపీ ప్రభుత్వ సలహాదారుగా పనిచేసిన ప్రముఖ పారిశ్రామికవేత్త కొవ్వూరుకు చెందిన రాజీవ్‌కృష్ణ ఇటీవల సైలెంట్‌గా ఉన్నారు. ఆయన మాజీ మంత్రి పెండ్యాల కృష్ణబాబు అల్లుడు. ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘా కోళ్లపు శివరామసుబ్రహ్మణ్యం పార్టీకి దూరంగా ఉన్నారు.రుడా మాజీ చైర్మన్ మేడపాటి షర్మిళారెడ్డి సైలెంట్‌గానే ఉన్నారు. మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్య ప్రకాశరావు, చందన నాగేశ్వర్ పరిస్థితి అంతే.జిల్లాలో కాస్త యాక్టివ్‌గా ఉండే రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను జిల్లా అధ్యక్ష పదవి నుంచి తప్పి రాష్ట్ర వైసీపీ యువజన విభాగం అధ్యక్షుడిగా నియమించడంతో ఆయన ఈ ప్రాంతంలో పెద్ద దృష్టిపెట్టే పరిస్థితి తక్కువే. ఇక రాజమ హేంద్రవరం మాజీ ఎంపీ మార్గాని భరత్ ఉక్రోశంతో ఉన్నట్టు తెలుస్తోంది. ఆయనకు సిటీ సమన్వయకర్త పదవి ఇవ్వకుండా సిటీ ప్రెసిడెంట్ పదవి ఇవ్వడంతో కినుక వహించినట్టు సమాచారం.మరొక పక్క నిడదవోలు మునిసిపల్ చైర్మన్ భూపతి ఆదినారా యణ,అక్కడి మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడి మధ్య దూరం పెరిగింది.చైర్మన్ జనసేనకు దగ్గరగా ఉంటున్నట్టు వైసీపీ కౌన్సిలర్లు కొందరు ఆరోపిస్తున్నారు. అయితే ఇప్పటి వరకూ కూటమి చేరికలకు పెద్దగా అనుమతి వ్వలేదు. ఇప్పుడిప్పుడే వచ్చేవారిని ఆహ్వానిస్తున్నారు. ఇటీవల రాష్ట్రంలో వైసీపీ నేతలు వరుసగా జైలుకు పోవడం,ఇటీవల తిరుపతి లడ్డు కల్తీ వ్యవహారం వైసీపీని బాగా ఇరకాటంలో పెట్టాయి. పైగా వైసీపీ అధికారంలో ఉన్నపుడు కార్యకర్తలను పట్టించుకో కపోవడం ఇవాళ ఆ పార్టీ మనుగడే ప్రశ్నార్థకం అవుతోంది. కొంత మంది కాంగ్రెస్‌లో చేరడానికి ప్రయత్నాలు చేస్తున్నారు.టీకే.విశ్వేశ్వరరెడ్డి ఇటీవల వైసీపీకి గుడ్‌బై చెప్పి కాంగ్రెస్‌లో చేరడంతో పాటు జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి కూడా చేపట్టిన సంగతి తెలిసిందే.గత సార్వత్రిక ఎన్నికల్లో రాజమహేంద్రవరం పార్లమెంటరీ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన పీసీసీ మాజీ అధ్యక్షుడు, ఏఐసీసీ వర్కింగ్ కమిటీ సభ్యుడు గిడుగు రుద్రరాజు వైసీపీ నుంచి కొందరిని ఆకట్టుకునే ప్రయత్నాలు చేస్తుండడం కూడా వైసీపీకి ఇబ్బంది కరంగా మారింది. కూటమి ద్వారాలు తెరిస్తే వైసీపీ ఖాళీ అయ్యే పరిస్థితి కనిపిస్తుంది.

నిడదవోలులో రచ్చకెక్కిన విభేదాలు

నిడదవోలు, సెప్టెంబరు 27 : నిడదవోలు వైసీపీలో మునిసిపల్ చైర్మన్ కుర్చీ కుమ్ములాట మరోసారి రచ్చకెక్కింది. ఒకరేమో చైర్మన్ కుర్చీ దిగనంటే.. మరొకరు చైర్మన్ కుర్చీ నాకు ఇవ్వాల్సిందే అంటూ పట్టుబడుతున్నారు. ఇదిలా ఉండగా శుక్రవారం నిడదవోలు మునిసిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని పలు కౌన్సిలర్లు బాయ్‌కట్ చేయడం చర్చనీయాంశమైంది. మునిసిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ కౌన్సిల్ అజెండాలోని అంశాలను సభ్యులతో చర్చించకుండానే సమావేశానికి తీసుకురావడాన్ని కౌన్సిలర్ కామిశెట్టి సత్యనారాయణ నిలదీశారు. మరో కౌన్సిలర్ పువ్వల రతీదేవి మాట్లాడుతూ కౌన్సిల్‌లో ప్రజాసమస్యలు అధికారుల దృష్టికి వెళ్లకుండా చైర్మన్ అడ్డుపడుతున్నారన్నారు. అజెండాలోని ఏ ఒక్క అంశం కౌన్సిల్ సభ్యులకు తెలియకుండా చైర్మన్ ఏకపక్షంగా వ్యవహ రిస్తున్నారని మండిపడ్డారు.కౌన్సిల్ సమావేశాన్ని వాయిదా వేయాలని డిమాండ్ చేస్తూ కౌన్సిల్ సభ్యులు సమావేశం నుం చి వాకౌట్ చేశారు. మొత్తం 28 మంది కౌన్సిల్ సభ్యులు ఉండగా వైకాపా కౌన్సిలర్లు ఇద్దరు, చైర్మన్ భూపతి ఆది నారాయణ,మరొక టీడీపీ కౌన్సిలర్ ఒక్కరు మాత్రమే కౌన్సిల్ హాలులో మిగిలారు. 22 మంది కౌన్సిలర్లు చైర్మన్ భూపతి ఆదినారాయణ విధానాలను వ్యతిరేకిస్తూ కౌన్సి ల్ సమావేశం నుంచి బయటకు వచ్చేశారు. పెద్దల ఒప్ప ందం ప్రకారం చైర్మన్ భూపతి ఆదినారాయణ పదవికి రాజీనామా చేయాల్సి ఉందన్నారు. అయినా రాజీనామా చేయకుండా అధికార పార్టీతో కలసి నడుస్తు న్నారని విమర్శించారు.

తేలని పెద్ద మనుషుల ఒప్పందం

2021 మునిసిపల్ ఎన్నికల్లో ఇద్దరు వైసీపీ కౌన్సిలర్లు చైర్మన్ పదవికి పోటీపడగా అప్పటి ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు ఇరువురి మధ్య ఒక ఒప్పందం చేశారు. 25వ వార్డు వైసీపీ కౌన్సిలర్ భూపతి ఆదినారాయణ రెండున్నర ఏళ్ళు,21వ వార్డు వైసీపీ కౌన్సిలర్ కామిశెట్టి సత్యనారా యణ రెండేళ్లు,మరో మహిళా కౌన్సిలర్ పువ్వల రతీదేవి ఆరు నెలలు చైర్మన్ బాధ్యతలు చేప ట్టేలా పెద్ద మనుషుల ఒప్పందం కుదుర్చుకున్నారు. అ యితే మునిసిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ నేటికి రాజీనామా చేయకపోవడంతో వైసీపీలో విభేదాలు వీధికె క్కాయి.ఆనాడు పెద్ద మనిషిగా వ్యవహరించిన మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు చైర్మన్ కుర్చీ లాటలో తల బొప్పి కట్టి ఎటూ తేల్చలేక కూర్చున్నారు. చైర్మన్ పదవికి రాజీనామాపై భూపతి ఆదినారాయణను వివరణకోరేందుకు ఫోన్‌లో ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.



స్వపక్షంలో..విపక్షం : నిడదవోలు కౌన్సిల్ సమావేశాన్ని వాకౌట్ చేసిన వైసీపీ కౌన్సిలర్లు

చైర్మన్ రాజీనామా చేయాలి : కామిశెట్టి



2021లో జరిగిన ఒప్పందం ప్రకారం భూపతి ఆదినారాయణ చైర్మన్ పదవికి రాజీనామా చేయాలి.మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడుకు, చైర్మన్‌కు అంత రంగిక వ్యవహారాలు చక్కపడినా రాజీనామా చేయకపోవడం సరికాదు. ఇప్పటికైనా రాజీనామా చేసి మాటనిలబెట్టుకోవాలి.



బెస్ట్ 4స్టార్ హోటల్... కాకినాడ గ్రాండ్ జీఆర్టీ

ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని విజయవాడలో శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా పలు కేటగిరీల్లో అవార్డులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రదానం చేశారు. బెస్ట్ 4 స్టార్ హోటల్స్ విభాగంలో కాకినాడ గ్రాండ్, జీఆర్టీ హోటల్‌కు ఎక్స్‌లెన్స్ అవార్డు అందజేశారు. కార్యక్రమంలో పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకారం



లక్ష్మణరావుకు అభినందనలు తెలుపుతున్న జడ్పీ ఉద్యోగులు

జడ్పీ సీఈవోగా లక్ష్మణరావు

కాకినాడ సిటీ, సెప్టెంబరు 27: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిషత్ సీఈవోగా వీవీఎస్ లక్ష్మణరావు బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ జడ్పీ కార్యాలయంలోని తన చాంబర్‌లో శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయనకు ఇన్‌చార్జి సీఈవో పి.నారాయణమూర్తి బాధ్యతలు అప్పగించారు. లక్ష్మణరావు డ్వామా విభాగంలో విజయనగరం జిల్లా గరివిడి క్లస్టర్‌లో ఏపీడీగా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జడ్పీలోని వివిధ విభాగాల అధిపతులు, ప్రజాప్రతినిధులతో కలిసి జిల్లా అభివృద్ధికి కృషిచేస్తానన్నారు. జడ్పీ ఉద్యోగులు సీఈవోను కలిసి అభినందనలు తెలిపారు. ఆయన కలెక్టర్ షాన్‌మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.



రమేష్‌బాబుకు అభినందనలు తెలుపుతున్న దృశ్యం

దేవదాయ శాఖ కాకినాడ జోన్ ఉప కమిషనర్‌గా రమేష్‌బాబు

పోర్టు సిటీ (కాకినాడ), సెప్టెంబరు 27: దేవదాయ, ధర్మదాయ శాఖ కాకినాడ జోన్ ఉప కమిషనర్‌గా డీఎల్‌వీ రమేష్‌బాబు కాకినాడ రామారావుపేటలోని ధార్మిక భవన్‌లో శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో డీసీగా పనిచేసిన ఎం.విజయరాజును కర్నూలు జిల్లా ఉరవకొండ నరసింహ స్వామి దేవాలయం ఈవోగా బదిలీ చేశారు. శ్రీకాకుళం జిల్లా అరసవిల్లి సూర్యనారాయణమూర్తి దేవస్థానం ఈవో రమేష్‌బాబును కాకినాడ జోన్ డీసీగా నియమించారు. గతంలో ఈయన రెండేళ్లు ఇన్‌చార్జి డీసీగా విధులు నిర్వర్తించారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ మూడు జిల్లాల పరిధిలో 250 దేవాలయాల్లో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. రాష్ట్రంలో ప్రముఖమైన విజయవాడ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం తమ పరిధిలో ఉందన్నారు. బాధ్యతలు స్వీకరించిన రమేష్‌బాబును సహాయ కమిషనర్లు అల్లు భవాని, విజయలక్ష్మి, రామమోహనరావు, దేవదాయ శాఖ జిల్లా అధికారి కాళ్లకూరి నాగేశ్వరరావు, తనిఖీదారులు వడ్డి ఫణీంద్ర కుమార్, బాలాజీ, గుర్రం ప్రసాద్, దేగల సతీష్ అభినందించారు.




సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న అధికారులు, కడియం ఆవ ప్రాంతంలో రైతులు, గ్రామస్తులతో మాట్లాడుతున్న అటవీ శాఖ అధికారులు

చిరుత అడుగు జాడేదీ!

- అదిగో పులి... ఇదుగో తోక అంటూ సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం
- ఆందోళనలో ప్రజలు, అయోమయంలో అటవీ శాఖ అధికారులు

కడియం, సెప్టెంబరు 27: అదిగో పులి... ఇదిగో తోక అంటూ జరుగుతున్న ప్రచారంతో తూర్పు గోదావరి జిల్లా కడియం మండల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. కొద్దిరోజులుగా వారి కంటి మీద కునుకు లేకుండా చేస్తున్న పులి విషయంలో ఇదే తంతు జరుగుతోంది. కడియం నర్సరీ ప్రాంతానికి పులి వచ్చిన నాటి నుంచి ప్రజలు భయాందోళనకు, దాని జాడ కానరాక అధికారులు అయోమయానికి గురవుతున్నారు. చిరుత పులి అక్కడ ఉంది.. ఇక్కడ ఉంది అంటూ సోషల్ మీడియాలో ప్రచారంతో ప్రజలంతా గందరగోళానికి గురవుతున్నారు. మంగళవారం కడియపులంక దోసాలమ్మ కాలనీ సమీపంలోని ఓ నర్సరీలో చిరుతను చూసిన వారు అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి పాదముద్రలు చూసి అవి పులివే అని నిర్ధారించారు. ఆ తర్వాత ఎవరూ పులిని చూసిన దాఖలాలు లేవు. ఏ సీసీ కెమెరాకూ చిక్కలేదు. అధికారులు పులి కదలికలను గుర్తిస్తున్నారు. శుక్రవారం చిరుత పులి జాడ కనిపించలేదు. ఈ నెల 26న కనిపించిన ప్రాంతంలో 20 కెమెరాలు ఏర్పాటు చేశారు. అవి రాత్రంతా ఆ ప్రాంతాన్ని చిత్రీకరించాయి. శుక్రవారం కెమెరాలను అధికారులు పరిశీలించినా ఎక్కడా చిరుత జాడ కానరాలేదు. ఉదయం నుంచీ వర్షం కురవడంతో దాని పాదముద్రలు లేవు. దాంతో పుకార్లు షికార్లు చేస్తున్నారు. పులి వెళ్లిపోయిందని విస్తృత ప్రచారం చేస్తున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చొప్పెల్ల లాకుల సమీపంలో చిరుతను చూశామని కొందరు ఇచ్చిన సమాచారంతో డీఎఫ్‌వో ఎంపీ ప్రసాదరావు ఓ బృందాన్ని అక్కడకు పంపించారు. అయితే ఎటువంటి ఆన వాళ్లు లేవు. కడియం ఆవ ప్రాంతంలో చిరుతను చూశామని ఇంకొందరు చెప్పడంతో మరో బృందం అక్కడికి వెళ్లింది. పరిశీలించగా ఎటువంటి జాడ కనిపించలేదు. గురువారం రాత్రి దుళ్లలో ఉందని కొందరు, ఏడిదలో ఉందని మరికొందరు సమాచారం ఇవ్వడంతో ఆయా ప్రాంతాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఎవరు ఎటువంటి సమాచారం ఇచ్చినా అధికారులు అక్కడకు వెళ్తున్నారు. చిరుత సమాచారం విషయంలో ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలని అధికారులు సూచిస్తున్నారు. ఎక్కడ పాదముద్రలు కనిపించినా ఆ ఫొటోలు, వీడియోలు తీసి తమకు సమాచారమిస్తే అవి పులివో కాదో నిర్ధారణ చేస్తామని అధికారులు చెప్తున్నారు.





చొప్పెల్ల లాకులు

భయం గుప్పిట్లో లంక గ్రామాలు

ఆలమూరు, సెప్టెంబరు 27: ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో గోదావరికి వరదలు వస్తాయని, అవి లంక గ్రామాలను ముంచెత్తుతాయని ప్రజలు ఆందోళన చెందుతారు. అయితే వారిని ఈసారి కొత్త భయం పట్టుకుంది. అదే చిరుత పులి. దివాన్‌చెరువు రిజర్వ్ ఫారెస్టు నుంచి ఓ చిరుత ఆలమూరు మండలాన్ని ఆనుకుని వున్న కడియం మండలం కడియపులంక, బుర్రిలంక, వీరవరం ప్రాంతాల్లో సంచరిస్తోందన్న సమాచారంతో ఇక్కడి లంక గ్రామాల ప్రజలు భయపడుతున్నారు. కడియపులంక, వీరవరం, పొట్టిలంకలతో సమానంగా ఆలమూరు మండలంలోని మడికి, ఇతర గ్రామాల్లో నర్సరీలు అధికంగా ఉన్నాయి. దీంతో చిరుత అక్కడి నుంచి ఈ ప్రాంతాలకు వెళ్లొచ్చని అధికారులు హెచ్చరిస్తున్నారు. లంక గ్రామాల్లో నర్సరీలు, తోటలు అధికంగా ఉండడంతో పులి ఈ ప్రాంతానికి రావొచ్చని భావిస్తున్నారు. దీంతో లంకవాసులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. మండలంలోని లంక గ్రామాల్లో రెండు రోజులుగా పులి మీదే జోరుగా చర్చ జరుగుతోంది. కొందరు ఆకతాయులు పులి మన ఊరు వచ్చేసిందంటూ భయపెడుతున్నారు. ఇటువంటి పుకార్లను నమ్మవద్దని అధికారులు హెచ్చరిస్తూ రాత్రివేళ అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.



సదస్సులో మాట్లాడుతున్న శాస్త్రవేత్త సూర్యనారాయణ

న్యూక్లియర్ సైన్స్‌తోనే సమాజ అభివృద్ధి

ఏలేశ్వరం, సెప్టెంబరు 27: కాకినాడ జిల్లా ఏలేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భౌతిక, రసాయన, గణిత శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ సదస్సు నిర్వహించారు. విశాఖపట్నం బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ శాస్త్రవేత్తలు ఎంవీ సూర్యనారాయణ, గౌరీశంకర్, ఎస్‌డీవీవీ జగన్నాథరావు, కె.రాఘవేంద్రరావు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన శాస్త్రవేత్త సూర్యనారాయణ మాట్లాడు తూ న్యూక్లియర్ సైన్స్‌తోనే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. వ్యాధులు నివారించడంలోను, మానవుని జీవిత కాలాన్ని పెంచడంలోను న్యూక్లియర్ సైన్స్ ముఖ్య పాత్ర వహిస్తుందన్నారు. ప్రస్తుత టెక్నాలజీ మానవ విలువల్లో ప్రత్యేక పాత్ర పోషిస్తోందని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రిన్సిపాల్ సునీత, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఇన్‌చార్జి ప్రగడ ప్రయాగ మూర్తి మాట్లాడుతూ విశాఖపట్నం బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ శాస్త్రవేత్తలు తమ విద్యార్థులకు న్యూక్లియర్ సైన్స్ ఆన్‌లైన్ రీసెర్చ్, ఆఫ్‌లైన్ రీసెర్చ్ అంశాలను చక్కగా వివరించారన్నారు. సదస్సులో సురేష్, రామారావు, మదీనా, వీరభద్రరావు, బంగార్రాజు, పుష్ప, సతీష్, ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

కోట సత్తెమ్మ అమ్మవారి హుండీల ఆదాయం రూ.20 లక్షలు

నిడదవోలు, సెప్టెంబరు 27: తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో వేంచేసియున్న కోట సత్తెమ్మ అమ్మవారి దేవస్థానంలో హుండీలను దేవదాయ శాఖ తనిఖీదారు ఎ.సృజన్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం తెరిచి లెక్కించారు. జూన్ 6 నుంచి సెప్టెంబరు 27 వరకు వరకు 92 రోజులకు ప్రధాన హుండీల ద్వారా రూ.19,64,972, అన్నదాన ట్రస్టు హుండీ ద్వారా రూ.1,20,664... మొత్తం రూ.20,85,636 ఆదాయం లభించినట్టు సహాయ కమిషనరు, కార్యనిర్వహణాధికారి వి.హరిసూర్యప్రకాష్ తెలిపారు. 10 గ్రాముల బంగారం, 205 గ్రాముల వెండి కూడా లభించిందన్నారు. లెక్కింపులో ఫౌండర్ ఫ్యామిలీ మెంబరు, చైర్మన్ దేవులపల్లి రవిశంకర్, ఆలయ సిబ్బంది, సేవా సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.



అవగాహన ఒప్పంద పత్రాలతో సీటీఆర్ఐ డైరెక్టర్ శేషుమాధవ్

పొగాకు, ఇతర పంటలపై పరిశోధనకు ఒప్పందం

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 27: కేంద్ర పొగాకు పరిశోధనా సంస్థ (సీటీఆర్ఐ) రాజమహేంద్రవరంలో పొగాకుతో పాటు పసుపు, మిరప, అశ్వగంధ, ఆముదం పంటలపై సంయుక్త పరిశోధనలు చేసేందుకు అవగాహన ఒప్పంద సంతకాలు చేసినట్టు డైరెక్టర్ మాగంటి శేషుమాధవ్ తెలిపారు. శుక్రవారం సీటీఆర్ఐలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు, మార్కెటింగ్‌పై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రైతు సాధికార సంస్థ (ఏపీసీఎన్ఎఫ్), జాతీయ వాణిజ్య పంట పరిశోధన సంస్థ (ఎన్ఐఆర్‌సీఏ)గా రూపాంతరం చెందిన సీటీఆర్ఐతో అవగాన ఒప్పందం చేసుకుందని చెప్పారు. పొగాకుతో పాటు ఇతర పంటలపై పరిశోధనలు చేస్తాయని, భవిష్యత్తులో నాణ్యమైన ఉత్పత్తుల లభ్యతతో పాటు మార్కెటింగ్ సౌకర్యం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏపీసీఎన్ఎఫ్ ప్రాజెక్టు జిల్లా మేనేజరు బి.తాతారావు, అడిషనల్ డీపీఎం షేక్ వలి, భువి ఎన్‌జీవో సంస్థ అధికారి నరసింహరావు, కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రం హెడ్ వీఎస్‌జీఆర్ నాయుడు, సీటీఆర్ఐ విభాగాధిపతులు, ఐటీఎంయూ నోడల్ ఆఫీసర్ హెచ్.రవిశంకర్, రైతులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో పర్యాటకానికి అనుమతిలేదు

ఐటీడీఏ పీవో, సబ్ కలెక్టరు

రంపచోడవరం, సెప్టెంబరు 27: ఏజెన్సీలోని పర్యాటక ప్రాంతాలలో శని, ఆదివారాల్లో పర్యాటకులకు అనుమతిలేదని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, సబ్ కలెక్టరు కల్పశ్రీ శుక్రవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఏజెన్సీలో కొండవాగులు పొంగి ప్రవహిస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. కొండవాగులు దాటే ప్రయత్నాలు చేయొద్దని ప్రజలకు సూచించారు.

గుర్రం జాషువా 'కవికోకిల' పురస్కారానికి

శిఖామణి ఎంపిక

నేడు విజయవాడలో ప్రదానం



యానాం, సెప్టెంబరు 27: యానానికి చెందిన సుప్రసిద్ధ కవి, 'కవిసంధ్య' సంపాదకుడు డాక్టర్ శిఖామణి గుర్రం జాషువా కవికోకిల పురస్కారానికి ఎంపికయ్యారు. గుర్రం జాషువా 129వ జయంతిని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ, ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం తనను ఈ పురస్కారానికి ఎంపిక చేసిందని శిఖామణి తెలిపారు. విజయవాడ కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జరిగే జాషువా జయంతి సభలో ఈ పురస్కారాన్ని ప్రదానం చేయనున్నారు. దుగ్గనపల్లి ఎజ్రాశాస్త్రి, టి.వరప్రసాద్, పి.రమణయ్య కూడా కవికోకిల పురస్కారానికి ఎంపికయ్యారు. సభలో ప్రత్యేక అతిథులుగా ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన, ముఖ్య అతిథిగా పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ పాల్గొంటారు.

29, 30, అక్టోబరు1 తేదీల్లో

పది ఎక్స్‌ప్రెస్ రైళ్లు రద్దు

కడియం, గోదావరి స్టేషన్ల మధ్య సిగ్నలింగ్ పనుల కారణంగా...

సామర్లకోట, సెప్టెంబరు 27: సిగ్నలింగ్ వ్యవస్థలో లోపంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని గుర్తించిన రైల్వే ఉన్నతాధికారులు ఆధునీకరణ పనులు చేపట్టారు. విజయవాడ డివిజన్ పరిధిలో కడియం-రాజమహేంద్రవరం, గోదావరి స్టేషన్-కొవ్వూరు సెక్షన్ల మధ్య ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్ వ్యవస్థను ప్రారంభించబోతున్నారు. ఇందులో భాగంగా నాన్ ఇంటర్ లాకింగ్ పనులు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 29, 30, అక్టోబరు 1 తేదీల్లో సామర్లకోట మీదుగా విశాఖ, విజయవాడ మధ్య రాకపోకలు సాగించే పది ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేస్తే రైల్వే ఉన్నతాధికారులు జారీ చేసిన ఉత్తర్వులు సామర్లకోట రైల్వే ఉన్నతాధికారికి శుక్రవారం రాత్రి చేరుకున్నాయి.

- తిరుపతి-విశాఖ డబుల్ డెక్కర్ (22708)ను ఈ నెల 29న రద్దు చేశారు.
- విశాఖ-తిరుపతి డబుల్ డెక్కర్ (22707)ను ఈ నెల 30న రద్దు చేశారు.
- విజయవాడ-విశాఖ రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ (12718), విశాఖ-విజయవాడ రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ (12717) ఈ నెల 30న రద్దు చేశారు.
- విశాఖ-గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (17240)ను ఈ నెల 30, అక్టోబరు 1 తేదీల్లో రద్దు చేశారు.
- గుంటూరు-విశాఖ సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (17239)ను ఈ నెల 29, 30 తేదీల్లో రద్దు చేశారు.
- విశాఖ-గుంటూరు (22701), గుంటూరు-విశాఖ (22702) ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 30న రద్దు చేశారు.
- రాజమహేంద్రవరం-విశాఖ (07466), విశాఖ-రాజమహేంద్రవరం (07467) మెమూ ప్యాసింజర్లను ఈ నెల 30న రద్దు చేశారు.



మంత్రి మనోహర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన సుధీర్

మంత్రి మనోహర్‌ని కలిసిన

తోట సుధీర్

కలెక్టరేట్ (కాకినాడ), సెప్టెంబరు 27: రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను ఏపీ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన తోట సుధీర్ శుక్రవారం విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిశారు. కార్పొరేషన్ ఛైర్మన్‌గా తనకు నియమించినందుకు మనోహర్‌కు సుధీర్ ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో రైతులకు ఉపయోగపడేలా పని చేయాలని మంత్రి సూచించినట్లు వెల్లడించారు. పేదలకు రేషన్ సరుకులు సకాలంలో అందేలా పటిష్టమైన కార్యాచరణ ప్రణాళికతో ముందుకు వెళ్దామని మంత్రి పేర్కొన్నారు. కార్పొరేషన్ ఛైర్మన్‌గా త్వరలో ప్రమాణం చేస్తానని సుధీర్ చెప్పారు.

బాధితులందరికీ న్యాయం చేస్తాం

- జీరో నుంచి రూ.500 కోట్ల మేర స్థిరాస్తుల గుర్తింపు
- సీజ్ చేసిన ఆస్తుల విక్రయానికి ప్రభుత్వ అనుమతి కోసం నిరీక్షణ
- జయలక్ష్మి కో-ఆపరేటివ్ సొసైటీ ఛైర్మన్ గంగిరెడ్డి త్రినాథరావు
- సభ్యులుగా పాత డైరెక్టర్లు ఇద్దరి ఎంపిక

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 27: కోట్లాది రూపాయలు డిపాజిట్లు వసూలు చేసి మోసానికి పాల్పడిన నిందితులు, రుణగ్రస్తుల నుంచి చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా డబ్బులు వసూలు చేసి బాధితులందరికీ న్యాయం జరిగేలా విశేష కృషి చేస్తున్నామని జయలక్ష్మి కో-ఆపరేటివ్ సొసైటీ ఛైర్మన్ గంగిరెడ్డి త్రినాథరావు తెలిపారు. ది జయలక్ష్మి ఎంఏఎం కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ సంస్థ 3వ మహాజన సమావేశాన్ని శుక్రవారం కాకినాడ దంటు కళాక్షేత్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా త్రినాథరావు మాట్లాడుతూ పాత కార్యవర్గం ఛైర్మన్, వైస్ ఛైర్మన్, డైరెక్టర్లు సుమారు రూ.582కోట్ల మోసానికి పాల్పడ్డారన్నారు. కొత్తగా ఏర్పాటైన పాలకవర్గం 2022 అక్టోబరు 3న బాధ్యతలు చేపట్టిందన్నారు. జీరో స్థాయి నుంచి లోన్లు, డిపాజిట్లకు చెందిన వాటి వివరాలు ఏమీ లేకపోయినా అహర్నిశలూ కృషి చేసి రికార్డులు, ఫైల్స్ తయారు చేసి, డిస్ప్యూట్ సెటిల్‌మెంట్ కమిటీ, అడ్వకేట్ నియామకం, సీఐడీ అధికారులు, పోలీసులు, ట్రిబ్యునల్ కోర్టుకు వెళ్లడం, నిందితులపై సివిల్ కేసులు దాఖలు చేశామన్నారు. రుణాల వసూళ్లకు ప్రత్యేక చర్యలు, 84 మంది నిందితుల స్థిరాస్తులను సీఐడీ సీజ్ చేయించిందని, వాటి విలువ సుమారు రూ.300 కోట్లు ఉంటుందన్నారు. హైదరాబాద్‌లో సీజ్ చేసిన 110 ఆస్తుల విలువ సుమారు రూ.200 కోట్లు ఉంటుందన్నారు. సీఐడీ 495 మందిపై ట్రిబ్యునల్ కేసు వేయగా ఇందులో 190 మందిపై రూ.497 కోట్ల రికవరీ కోసం సివిల్ కేసులు దాఖలు చేస్తున్నామన్నారు. జీరో స్థాయి నుంచి కాకినాడలో ప్రత్యేక బ్యాంకు అకౌంట్ ఓపెన్ చేసి రూ.4.43,51,898 కోట్లు రికవరీ చేశామన్నారు. వడ్డీల రూపంలో 43.32 లక్షలు వచ్చిందన్నారు. కోర్టు సీజ్‌లో రూ.6కోట్లు ఉందని, మొత్తంగా రూ.10 కోట్లు ఉందన్నారు. నిందితుల స్థిరాస్తులను చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా స్వాధీనం చేసుకుని, బాధితులందరికీ డిపాజిట్ సొమ్ము చెల్లిస్తామన్నారు. కొంత మంది పనిగట్టుకుని పాలకవర్గంపై విష ప్రచారం చేస్తున్నారన్నారు. డిపాజిటర్ల ఆర్థిక ప్రయోజనాలే ముఖ్యంగా డైరెక్టర్లంతా సమష్టిగా పని చేస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, త్వరితగతిన సేల్ ఆర్డర్ వచ్చేలా ప్రభుత్వంతో మాట్లాడి చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు. సొసైటీ తరపున ప్రభుత్వం, కోర్టు, సీఐడీ, రుణగ్రహీతలపై జరిపే లావాదేవీలన్నిటినీ పాలకవర్గ సభ్యులకు అప్పగిస్తూ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఇద్దరు డైరెక్టర్ల ఎన్నికలో కొంత గందరగోళం నెలకొంది. పాత డైరెక్టర్లు జోస్యుల స్వామిప్రసాద్ (అమలాపురం), షేక్ జానీ పాషా (కాకినాడ)లను సభ్యులుగా తిరిగి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో డైరెక్టర్లు సీహెచ్ సుబ్బారావు, పీవీ రమణమూర్తి, కె.గౌరీశంకరరావు, ఏవీఎస్ రవికుమార్, ఎ.శ్రీనివాస్, కె.సురేష్, ఎ.గవర్రాజుకుమార్, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన సుమారు 520 మంది సభ్యులు పాల్గొన్నారు.



దంటు కళా క్షేత్రంలో జరిగిన సదస్సులో మాట్లాడుతున్న త్రినాథరావు

ఏజెన్సీ సమాచారం



ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న వరద బాధితులు

వరద బాధితులకు కూటమి ప్రభుత్వం అండ

వరరామచంద్రాపురం, సెప్టెంబరు 27: వరద బాధితులకు కూటమి ప్రభుత్వం అండగా ఉందని తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొర్ర నరేష్‌కుమార్, మాజీ జడ్పీటీసీ ముత్యాల రామారావు అన్నారు. వరద బాధితులకు సహాయంగా రూ.10వేలు, జీవన భృతిగా రూ.4,800 వారి బ్యాంకు ఖాతాల్లోకి ప్రభుత్వం జమ చేసింది. ఈ నేపథ్యంలో ఒడ్డిగూడెంలో వరద బాధిత కుటుంబాలు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలభిషేకం చేసి హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ముత్యాల సిద్ధు, ముత్యాల చంద్రశేఖర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఇది మంచి ప్రభుత్వం'కు స్పందన

చింతూరు, సెప్టెంబరు 27: మండలంలో నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందని టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు ఇల్ల చిన్నారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వంద రోజుల్లో కూటమి ప్రభుత్వం చేసిన పనులను గ్రామగ్రామాన వివరించామని చెప్పారు. కూటమి నాయకులు రమణారెడ్డి, మడవిరాజు, సయ్యద్ ఆసిఫ్, శీలం తమ్మయ్య పాల్గొన్నారు.



ఇందుకూరుపేట సమీపంలో పొంగి ప్రవహిస్తున్న ఇనుకొండ వాగు

పొంగిన వెలగపల్లి, సీతపల్లి, ఇనుకొండ వాగులు

దేవీపట్నం, సెప్టెంబరు 27: మండలంలో రెండు రోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు వెలగపల్లి, సీతపల్లి, ఇనుకొండ వాగులు పొంగి ప్రవహించాయి. దీంతో ఆయా గ్రామాలకు రాకపోకలకు అంతరాయమేర్పడింది. వ్యవసాయ పనులు లేక కూలీలు, బేరాలు లేక చిరు వ్యాపారులు ఇబ్బందిపడ్డారు. జనజీవనం స్తంభించింది.

మోతుగూడెం ఎస్ఐగా శివనారాయణ



మోతుగూడెం, సెప్టెంబరు 27: మోతుగూడెం ఎస్ఐగా కె.శివనారాయణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన పాడేరు నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేసిన జి.గోపాలరావు అరకు పీఎస్‌కు బదిలీ అయ్యారు.



చింతూరు ఎస్ఐగా రమేష్

చింతూరు, సెప్టెంబరు: 27: చింతూరు ఎస్ఐగా రమేష్ నియమితులయ్యారు. శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఎస్ఐగా పనిచేసిన శ్రీనివాసరావు అనంతగిరి బదిలీ అయ్యారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సంపూర్ణత అభియాన్

మోతుగూడెం, సెప్టెంబరు 27: మోతుగూడెం సెక్టారు పరిధిలోని డొంకరాయి గ్రామ సచివాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కరకా జయకుమారి, చింతల నాగమణి ఆధ్వర్యంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం 'సంపూర్ణత అభియాన్-పోషకాహార మాసోత్సవం' నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీటీసీ కరకా వెంకటరమణ మాట్లాడుతూ ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు కలలుకంటున్న ఆరోగ్య భారతదేశం, ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధించాలని.. 2047 లక్ష్యాలకు చేరువ కావాలని పిలుపునిచ్చారు. అంగన్‌వాడీ టీచర్లు పోషకాహార వంటకాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సంఘమిత్ర, ప్రియాంక, ఐసీడీఎస్ చింతూరు కో-ఆర్డినేటర్ రాజు, పంచాయతీ వార్డు సభ్యుడు నీలావు సత్యనారాయణ, మాజీ ఉప సర్పంచ్ గంగిరెడ్ల గురుమూర్తి, కిముడు మూర్తి, పంచాయతీ సెక్రటరీ రవి నాయక్, సచివాలయ సిబ్బంది మురళి, బేబి, విజయలక్ష్మి, త్రిమూర్తులు, సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

'ప్రిన్సిపాల్, పీడీలపై చర్యలు తీసుకోవాలి'



రంపచోడవరం, సెప్టెంబరు 27: రంపచోడవరం గిరిజన గురుకుల సంక్షేమ కళాశాలలో క్రమశిక్షణ పేరుతో విద్యార్థినులపై వేధింపులకు పాల్పడిన ప్రిన్సిపాల్, పీడీలపై తక్షణం చర్యలు తీసుకోవాలని, వారిని విధుల నుంచి సస్పెండ్ చేయాలని కోరుతూ ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు మట్ల వాణిశ్రీ, ఈ.సిరిమల్లిరెడ్డి శుక్రవారం అమరావతిలో రాష్ట్ర గురుకుల డిప్యూటీ సెక్రటరీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థినుల పట్ల నిరంకుశంగా ప్రవర్తించడమే కాకుండా ఒక్కో విద్యార్థినిని 200 నుంచి 300 గుంజీలు తీయించడాన్ని ఖండించారు. ఇలాంటి ఉపాధ్యాయులు వల్ల విద్యార్థులు విద్యకు దూరమయ్యే పరిస్థితి ఉందన్నారు. ప్రిన్సిపాల్, పీడీలపై చర్యలు తీసుకోకుంటే విద్యార్థుల తల్లిదండ్రులతో ఆందోళనలు చేయిస్తామని తెలిపారు. సెక్రటరీని కలిసిన వారిలో బి.రత్నకుమారి తదితరులు వున్నారు.

గెస్ట్ టీచర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రంపచోడవరం, సెప్టెంబరు 27: రంపచోడవరం, చింతూరు ఐటీడీఏల పరిధిలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి గెస్ట్ టీచర్‌గా సీబీఎస్ఈ సిలబస్‌లో ఆంగ్ల మాధ్యమంలో బోధించుటకు ఆసక్తి, అర్హత గల రిటైర్డ్ టీచర్స్ ఆయా సబ్జెక్టులకు సంబంధించిన విద్యార్హతలు కలిగి ఉన్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీజీటీ (తెలుగు)-3, టీజీటీ (హిందీ)-1, పీజీటీ (బయాలజీ)-3, పీజీటీ (ఫిజిక్స్)-2 పోస్టులు ఉన్నాయన్నారు. దరఖాస్తులను రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయం, గురుకులం సెల్‌లో అక్టోబరు 5వ తేదీలోగా అందజేయాలన్నారు.



ఉద్యోగ భద్రత కల్పించాలని ధర్నా

కూనవరం, సెప్టెంబరు 27: ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో వలంటీర్లు ఎంపీడీవో కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు నాలుగు నెలలుగా తమకు వేతనాలు లేవని, వెంటనే ఉద్యోగంలోకి తీసుకోవాలన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చి రూ.10వేలు జీతం ఇవ్వాలని కోరారు. సీఐటీయూ నాయకుడు కొమరం పెంటయ్య, వలంటీర్లు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ జేఈగా పరశురాముడు


ఎటపాక, సెప్టెంబరు 27: విద్యుత్ శాఖ ఎటపాక జేఈగా పరుశురాముడు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సమస్యలు, సేవలపై తనకు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఇప్పటివరకు ఎటపాక జేఈగా వున్న రాజ్‌కపూర్ కూనవరం బదిలీ అయ్యారు.

రేపు యూటీఎఫ్ జిల్లా ఆటల పోటీలు

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 27: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) ఆవిర్భవించి 50 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈనెల 29వ తేదీ ఉదయం 9గంటలకు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానంలో జిల్లా స్థాయి ఆటల పోటీలు జరుగుతాయని జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.షరీఫ్ తెలిపారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో జరిగే ఈ పోటీల్లో క్రికెట్, వాలీబాల్, షటిల్, బ్యాడ్మింటన్, రన్నింగ్, వాకింగ్, షాట్‌ఫుట్ తదితర క్రీడాంశాల్లో పోటీలు జరుగుతాయని తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాల నుంచి ఉపాధ్యాయులు ఆటల పోటీల్లో పాల్గొనాలని ఆయన కోరారు.

ఈ సారైనా దక్కేనా!

- నామినేటెడ్ పోస్టుల మలి జాబితాపై ఆశలు
- తొలి జాబితాలో కొందరికి న్యాయం .. కూటమి నేతల్లో ఉత్కంఠ



రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 25: నామినేటెడ్ పోస్టుల కోసం కూటమి నేతలు చాలా ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. రాష్ట్రంలో ఉమ్మడి గోదావరి జిల్లాలు రాజకీయంగా ముఖ్య భూమిక వహిస్తాయి. ఈ ప్రాంతాల నుంచి రాజకీయ నాయకులు ఐదేళ్లుగా రాజకీయ నిరుద్యోగులుగా మారిపోయారు. వైసీపీ పాలనలో చాలా ఇబ్బందులు ఎదుర్కొన్న టీడీపీ, జనసేన నేతలు సార్వత్రిక ఎన్నికల్లో అంకితభావంతో పని చేశారు. వారి కష్టాన్ని స్వయంగా చూసిన ఎమ్మెల్యేలు ఆయా నాయకులకు సముచిత స్థానం కల్పించాలని వివిధ కార్పొరేషన్ పదవులకు సిఫార్సు చేశారు. టీడీపీ అధినాయకత్వం కూడా క్షేత్రస్థాయిలో రిపోర్టును తెచ్చుకుని పరిశీలన చేసి ఎవరు కష్టపడ్డారు.. ఎవరు నామినేటెడ్ పదవులకు అర్హులు అనే దానిపై సర్వే చేసింది. వీటన్నిటినీ క్రోడీకరించుకుని పలువురికి కార్పొరేషన్ చైర్మన్, ఇంకొందరికి డైరెక్టర్ పదవులు కట్టబెట్టారు. మంగళవారం విడుదల చేసిన జాబితాలో పదవులు పొందిన వారు ఆనందోత్సాహాల్లో వున్నారు. మలి దశలో తమను పదవి వరిస్తుందా లేదా అని మిగిలిన కేడర్‌లో ఉత్కంఠ నెలకొంది. గత ప్రభుత్వంలో పలు కార్పొరేషన్ల చైర్మన్, డైరెక్టర్ పదవుల్లో రాజమహేంద్రవరానికి అధిక ప్రాధాన్యమిచ్చారు. ఇప్పటికే ఐదుగురిని పదవులు వరించాయి.

ఇంకా ఏం మిగిలి ఉన్నాయ్..

రాష్ట్రంలో ఇంకా మిగిలి ఉన్న కార్పొరేషన్లు, వివిధ సంస్థల చైర్మన్లు, డైరెక్టర్ల పదవులపై కూటమి నాయకులు ఆశలు పెట్టుకున్నారు. ముఖ్యంగా బ్రాహ్మణ, బీసీ, కాపు, ఎస్సీ కార్పొరేషన్లతోపాటు బ్యూటిఫికేషన్, రుడా, ఆప్కో, లేపాక్షి తదితర 75 సంస్థలకు చైర్మన్లు, డైరెక్టర్లను కూటమి ప్రభుత్వం ఎంపిక చేయాల్సి ఉంది. జిల్లాలో మంత్రి దుర్గేష్, ఇతర ఎమ్మెల్యేలు వారి పరిధిలో సీనియర్లను నామినేటెడ్ పోస్టులకు ఇప్పటికే సిఫార్సు చేశారు. వీటిలో పదవులు ఆశించే వారి సంఖ్య ఎక్కువగానే ఉంది. ఆశావహులంతా ఆశల పల్లకిలో ఉన్నారు.

పవన్‌కల్యాణ్ ప్రాయశ్చిత దీక్షకు సంఘీభావం



గోకవరంలో వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద దీక్షలో జనసైనికులు

- గాదరాడలో ఎమ్మెల్యే బత్తుల హోమాలు, పూజలు

కోరుకొండ, సెప్టెంబరు 27: తిరుపతి వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన పాలక మండలి వ్యవహార శైలితో లడ్డూ కల్తీ ద్వారా చేసిన అపచారానికి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ శుక్రవారం గాదరాడలోని ఆయన స్వగృహంలో గణపతి, రుద్ర, మహాచండీ హోమం చేపట్టారు. ఎమ్మెల్యే, ఆయన సతీమణి వెంకటలక్ష్మి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ తిరుమల ప్రసాదాన్ని భక్తులు పవిత్రంగా భావిస్తారని, కల్తీ నెయ్యి వాడకంపై ప్రతిఒక్కరిలో ఆవేదన ఉందన్నారు. పవన్ దీక్షకు సంఘీభావం తెలపడం అందరి బాధ్యత అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జనసేన ఎమ్మెల్యేలు, నాయకులు, శ్రేణులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు,హోమాలు, ధార్మిక కార్యక్రమాలు చేపట్టామని బత్తుల చెప్పారు.

గోకవరం: పవన్ ప్రాయశ్చిత దీక్షకు మద్దతుగా గోకవరంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద జనసైనికులు దీక్ష చేపట్టారు. దీనికి జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్‌తో పాటు, విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు, కూటమి నాయకులు సంఘీభావాన్ని తెలియజేశారు. రమేష్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో హిందువుల మనోభావాలతో ఆడుకుంటూ వారి విశ్వాసాలను దెబ్బతీసారని మండిపడ్డారు. కల్తీ నెయ్యి సరఫరా చేసిన వారిని, సహకరించిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు.

'సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలి'

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 27: తిరుపతి శ్రీవారి లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగించినట్టు సీఎం చంద్రబాబు ప్రకటించిన నేపథ్యంలో ఈ సంఘటనపై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలని వైసీపీ నాయకులు కానబోయిన సాగర్, మార్తి నాగేశ్వరరావు, బిల్డర్ చిన్నా డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ లడ్డూ కల్తీ సంఘటనపై ఈవో శ్యామలరావుపై చర్యలు తీసుకోవాలన్నారు. టీటీడీ స్వయంప్రతిపత్తి సంస్థ అని, దానికో కమిటీ ఉందన్నారు. హిందువుల మనోభావాలు కాపాడాలంటే లడ్డూ విషయంలో సిట్‌తో కుదరదని సుప్రీంకోర్టు న్యాయమూర్తితో ఎంక్వైరీ వేయాలన్నారు.

ఏం రుజువు చేసుకోవడానికి తిరుపతి వస్తున్నావ్?

- డిక్లరేషన్ ఇచ్చేందుకు ఎందుకు అభ్యంతరం
- మాజీ సీఎం జగన్‌పై ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు విమర్శ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 27: చేసినదంతా చేసి ఇప్పుడు ఏం రుజువు చేసుకోవడానికి తిరుపతికి వస్తున్నావ్ జగన్ అని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ నిలదీశారు. రాజమహేంద్రవరంలోని హోటల్ జగదీశ్వరిలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏ పనీపాట లేకుండా ఉన్న పులివెందుల ఎమ్మెల్యే జగన్‌రెడ్డి బెంగుళూరు నుంచి తాడేపల్లి చేరుకుని అక్కడ కొంతమంది ఇచ్చే పనికిమాలిన సలహాలు సూచనలతో రాష్ట్రంలో అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. గత ఐదేళ్లలో జగన్ దంపతులు ఎందుకు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించలేదని ప్రశ్నించారు. వందరోజులుగా కూటమి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రజల నుంచి వస్తున్న స్పందన చూసి తట్టుకోలేక రాష్ట్రంలో అల్లర్లు, లాండ్ ఆర్డర్ సమస్యను సృష్టించి మత విద్వేషాలు రెచ్చగొట్టాలని జగన్ చూస్తున్నారన్నారు. డిక్లరేషన్ ఇచ్చేందుకు ఎందుకు అభ్యంతర పడుతున్నారని జగన్‌ను ప్రశ్నించారు. ప్రధాని మోదీ సహకారం, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆలోచన విధానాలతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. అనంతరం పది మందికి సీఎం సహాయ నిధి నుంచి రూ.16 లక్షల చెక్కులను ఎమ్మెల్యే వాసు అందించారు. సమావేశంలో జనసేన ఇన్‌చార్జి అత్తి సత్యనారాయణ, చల్లా శంకరావు, బొమ్మన జయకుమార్, యెనుముల రంగబాబు, బూరా రామచంద్రరావు, తవ్వా రాజా, రొబ్బి విజయశేఖర్, మండవిల్లి శివ పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ రాష్ట్ర పోటీలకు విద్యార్థుల ఎంపిక



అనపర్తిలో బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

అనపర్తి, సెప్టెంబరు 27: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆటల పోటీల్లో పలువురు విద్యార్థులు జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. అనపర్తి జడ్పీ హైస్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు హెచ్ఎం పులగం వెంకటరెడ్డి తెలిపారు. పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న దనకొండ లక్కీ, ఇంటర్ ఫస్టియర్ చదువుతున్న నందిక ఐశ్వర్య అండర్-14, అండర్-17 విభాగాల్లో రాష్ట్ర స్థాయిలో పోటీల్లో పోటీల్లో జిల్లా తరపున ఆడనున్నారని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఎంఈవో నల్లమిల్లి సత్తిరెడ్డి, ఎస్ఎంసీ చైర్‌పర్సన్ మల్లిడి పార్వతి, వైస్ చైర్‌పర్సన్ టి.రాజేశ్వరి, వ్యాయామోపాధ్యాయులు టీవీఎస్ రాఘవరెడ్డి, శ్రీనివాస్, మోహన్, మాజీ వైఎస్ ఎంపీపీ మల్లిడి శ్రీనివాసరెడ్డి అభినందించారు.

ఆర్చరీలో తొర్రేడు విద్యార్థుల ప్రతిభ..

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 27: ఇటీవల కాకినాడలోని స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో జరిగిన స్కూల్ గేమ్స్‌లో తొర్రేడు ఉన్నత పాఠశాల విద్యార్థులు.. ఆర్చరీ అండర్-14 బాలికల విభాగంలో టి.గీతిక, అండర్-17లో కె.అమూల్య అండర్-17 బాలుర విభాగంలో పి.యశ్వంత్, కె.ఉపేంద్ర, రికర్వ్ విభాగంలో అండర్-17లో కె.జాన్సన్, అండర్-14లో జి.రాహుల్, సీహెచ్ నవీన్, కాంపౌండ్ విభాగం అండర్-17లో జి.ప్రవీణ్‌కుమార్, కె.చైతన్య శ్రీవిజయలక్ష్మి, స్విమ్మింగ్‌లో అండర్-17 విభాగంలో 200 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ ఐ.రవికిరణ్ జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచారన్నారు. వీరు మన్యం జిల్లా పార్వతీపురంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని హెచ్ఎం ఎం.సాయిబాబా తెలిపారు. విద్యార్థులతోపాటు పీడీ ఎం.కుమారిని అభినందించారు.



తొర్రేడులో ఆర్చరీ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

స్వర్ణాంధ్ర-2047 పోటీలు



కడియంలో జరిగిన పోటీల్లో విజేతలైన విద్యార్థులు

కోరుకొండ, సెప్టెంబరు 27: స్వర్ణాంధ్ర-2047లో భాగంగా శుక్రవారం మండల స్థాయి పోటీలను కోరుకొండ ప్రభుత్వ హైస్కూల్లో ఎంఈవో టి.కుశలవ దొర ఆధ్వర్యంలో నిర్వహించారు. మండలంలోని వివిధ ప్రభుత్వ జడ్పీ హైస్కూళ్ల నుంచి 100మంది విద్యార్థులు పాల్గొన్నారు. చర్చ, వ్యాసరచన, వక్తృత్వం అంశాల్లో పోటీలు నిర్వహించగా గాడాల, బూరుగుపూడి,శ్రీరంగపట్నం, కోటికేశవరం, కోరుకొండ పాఠశాలల విద్యార్థులు ప్రతిభకనబరిచారని తెలిపారు. వీరు రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ హైస్కూల్లో ఈ నెల 30న జరిగే జిల్లాస్థాయి పోటీలకు హాజరువుతారని ఎంఈవో చెప్పారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పి.రమణమూర్తి, ఎ.రామారావు రెడ్డి, జడ్జిలుగా పీఎస్ హెచ్ఎం కె.మోహన్, ఎ.విజయ్‌కుమార్, ఆర్ఎస్ ప్రకాష్ ఉన్నారు. సీఆర్ఎండీలు డి.మోహన్, సీహెచ్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కడియం: కడియం ఉన్నత పాఠశాలలో జరిగిన పోటీలను ఎంఈవోలు నాగేశ్వరరావు, మణికుమార్ ప్రారంభించారు. మండలంలోని 9 ఉన్నత పాఠశాలల నుంచి 20 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వక్తృత్వంలో వి.లావణ్య (కడియం), సీహెచ్ మణికంఠ (వీరవరం), వర్షిత్(మురమండ), వ్యాసరచనలో ఎస్ రమ్యశ్రీ (కడియం), కృష్ణచైతన్య (దుళ్ళ), యశ్వంత్ (వీరవరం) మొదటి మూడుస్థానాల్లో నిలిచారని హెచ్ఎం టి.సత్యనారాయణ తెలిపారు. గొల్లపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో న్యాయ నిర్ణేతలుగా ఎస్.శ్రీనివాస్, పాల్ శంకరం, ప్రభాకరరాజు వ్యవహరించారు.

వరద బాధితులకు రూ.2.60 లక్షల విరాళం

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 27: విజయవాడ వరద బాధితుల సహాయార్థం రాష్ట్ర నూర్ బాషా సంక్షేమ సంఘం రూ.2,60,200 చెక్కును రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు అందించింది. శుక్రవారం విజయవాడలో నూర్ బాషా సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ రాజమహేంద్రవరానికి చెందిన షేక్ సుభాన్, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.పీర్ మహమ్మద్, డాక్టర్ బాబాన్, ఆదాం షఫీ, నారూర్ మీరావలి, ఇబ్రహీం తదితరులు లోకేశ్‌ను కలిశారు.



'బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలి'

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): కందుకూరి రాజ్యలక్ష్మి మహిళా కళాశాలలో విద్యార్థినులకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మహిళా చట్టాలు, రాజ్యాంగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్‌బాబు మాట్లాడుతూ రాజ్యాంగం పట్ల ప్రతిఒక్కరూ గౌరవభావంతో ఉండాలన్నారు. ప్రాథమిక హక్కులను కాపాడుకోవడం ఎంత ముఖ్యమో బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించడం కూడా అంతే ముఖ్యమన్నారు. సమయం చాలా విలువైనదని, సమయపాలన కలిగిన వారు ఉన్నతస్థాయికి చేరుకుంటారన్నారు. కార్యక్రమంలో విశ్రాంత జడ్జి శ్రీనివాస్, ప్యానల్ అడ్వొకేట్ దేవిభవానీ పాల్గొన్నారు.

రామకృష్ణ మిషన్‌లో యువజన సదస్సు

రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 27: స్థానిక రామకృష్ణ మిషన్‌లో శుక్రవారం విద్యార్థులకు యువజన సదస్సు నిర్వహించింది. వివిధ కళాశాలల నుంచి 380 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో స్వామి శశికాంత్ మహరాజ్, స్వామి పరిజ్ఞాయానందజీ మహరాజ్, స్వామి వేదవిద్యానందజీ, స్వామి సేవ్యానందజీ మహరాజ్, ప్రజ్ఞానందజీ మహరాజ్, బ్రహ్మచారి కరణ్ మహరాజ్, అమిరపు నటరాజన్ ప్రసంగిస్తూ ధార్మిక, నైతిక విలువల ప్రాధాన్యత, మత సామరస్యం, దైనందిన సమస్యలను ఎలా ఎదుర్కోవాలో వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న కళాశాలలకు మెమెంటోలు, విద్యార్థులకు ధ్రువపత్రాలు, స్వామి వివేకానంద సాహిత్యం పంపిణీ చేశారు.

పురావస్తుశాఖకు కందుకూరి పుస్తకాల అందజేత

రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబర్ 27: సాహితీవేత్త, సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగాం పంతులుకు సంబంధించిన అరుదైన 60 సాహిత్య పుస్తకాలను పురావస్తుశాఖకు బహూకరించినట్టు కందుకూరి పరిశోధకుడు పీవీబీ సంజీవరావు తెలిపారు. పురావస్తుశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె.తిమ్మరాజు మాట్లాడుతూ పర్యాటక దినోత్సవం సందర్భంగా భావితరాలకు కందుకూరి సాహిత్యాన్ని, వస్తువులను, గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని ప్రదర్శనకు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పల్లి సుధ, ఎండీ మోషే, చీర్ల సీతారామనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పందలపాకలో దసరా ఉత్సవాలకు శ్రీకారం

బిక్కవోలు, సెప్టెంబరు 27: పందలపాకలోని సంతోషిమాత ఆలయ ఆవరణలో సొసైటీ మాజీ అధ్యక్షుడు పడాల సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే దసరా ఉత్సవాలకు శుక్రవారం శ్రీకారం చుట్టారు. అమ్మవారి కలశ స్థాపన చేసే భక్తులు బొడ్డు ముత్యాలరావు, గంగాభవాని దంపతులు పందిరి రాట వేసి ఉత్సవ పనులు ప్రారంభించారు. అలాగే కొంకుదురు మూలటాపు వద్ద విజయదుర్గమ్మ శరన్నవరాత్రి ఉత్సవాలకు అడపా పెద్ద, వీరభవాని దంపతులు రాట మంచి వేశారు.

రోడ్డుపై కూలిన వృక్షం

గోకవరం, సెప్టెంబరు 27: మండలంలో కురిసిన భారీ వర్షానికి గాదెలపాలెం-ఇటికాయిలపల్లి రోడ్డులో శుక్రవారం తెల్లవారు ఝామున భారీ వృక్షం నేలకూలింది. దీంతో ఆ రెండు గ్రామాలకు రాకపోకలు స్తంభించిపోయాయి. కొందరు ప్రయాణికులు వృక్షాన్ని తొలగించే ప్రయత్నం చేసినప్పటికీ వారికి సాధ్యపడలేదు. విషయం తెలుసుకున్న భూపతిపాలెం గురుకుల పాఠశాల చైర్మన్ గల్లా రాము, ఎంపీటీసీ సభ్యుడు గల్లా కృష్ణ.. కొంతమంది గ్రామస్థుల సహకారంతో సుమారు రెండు గంటల పాటు శ్రమించి రోడ్డుపై కూలిన చెట్టును పూర్తిగా తొలగించి ప్రయాణికుల రాకపోకలను పునరుద్ధరించారు.

ముంపు నివారణకు చర్యలు తీసుకోవాలి : సీపీఐ

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 27: రాజమహేంద్రవరం నగరంలో ముంపు నివారణకు సిటీ ఎమ్మెల్యే, మునిసిపల్ కమిషనర్ చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సీపీఐ నాయకులు నగరంలోని లోతట్టు ప్రాంతాలను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ కొద్దిపాటి వర్షం కురిసినా నగరంలో ప్రధానంగా తుమ్మలావ, శ్యామలాసెంటర్, ఆల్కట్‌గార్డెన్స్ రైల్వే స్టేషన్ ఏరియా, బాలాజీపేట, తాడితోట ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నగరంలో ముంపు నివారణకు ఎమ్మెల్యే, కార్పొరేషన్ అధికారులు తక్షణమే యాక్షన్‌ప్లాన్ అమలు చేయాలని కోరారు. ఈ పర్యటనలో సీపీఐ నగర కార్యదర్శి కొండలరావు, రామకృష్ణ, శ్రీనివాస్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అసౌకర్యం కలగకుండా చర్యలు

జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభ

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 27: రాజమహేంద్రవరం జీజీహెచ్‌కు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, పింఛను సంబంధిత అవసరాల కోసం వస్తున్న దివ్యాంగులకు అసౌకర్యం కలగకుండా, జాప్యం లేకుండా చర్యలు తీసుకుంటామని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.లక్ష్మీసూర్యప్రభ తెలిపారు. శుక్రవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో దివ్యాంగులతో ఆటలా... శీర్షికతో ప్రచురితమైన వార్తకు సూపరింటెండెంట్ స్పందిస్తూ, గురువారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల కోసం 71 దరఖాస్తులు వచ్చాయన్నారు. దరఖాస్తులు సమర్పించడానికి దివ్యాంగులతోపాటు వారి బంధువులు, ఇతర జిల్లాల నుంచి దివ్యాంగులు వస్తున్నారని తెలిపారు. ప్రతి వారం జీజీహెచ్‌లో సదరం రిజిస్ట్రేషన్లకు అధిక సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నామన్నారు.

అనపర్తిలో భారీ వర్షం

అనపర్తి, సెప్టెంబరు 27: అనపర్తిలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. సుమారు రెండు గంటల పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి మండల పరిషత్ కార్యాలయం, బాలికోన్నత పాఠశాల, బోనాసు వీధి తదితర పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. జనజీవనం స్తంభించింది. ఉదయం నుండే వర్షం ప్రారంభం కావడంతో విద్యార్థులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

రాజానగరం సబ్‌రిజిస్ట్రార్‌గా వెంకటేశ్వర్లు

రాజానగరం, సెప్టెంబరు 27: రాజానగరం సబ్ రిజిస్ట్రార్‌గా వి.వెంకటేశ్వర్లు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నిడదవోలు సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఈయన బదిలీ ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసిన వీరభద్రరావు బదిలీపై కాకినాడకు వెళ్లారు. ఈ సందర్భంగా పలువురు దస్తావేజు లేఖర్లు సబ్ రిజిస్ట్రార్‌ను కలిసి ఘనంగా సత్కరించారు. అలాగే కార్యాలయంలో విధులు సిబ్బంది అంతా బదిలీపై వెళ్లారు.

రేపు వాక్ ఫర్ హార్ట్

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 27: ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా ఈనెల 29న గుండెవ్యాధులపై ప్రజలకు అవగాహన కోసం వాక్ ఫర్ హార్ట్ పేరుతో గుండె కోసం 3కే నడక కార్యక్రమం నిర్వహిస్తున్నామని రాజమహేంద్రవరానికి చెందిన పల్స్ హాస్పిటల్స్ యాజమాన్యం, వైద్యనిపుణులు డాక్టర్ వంశీకృష్ణరాజు, డాక్టర్ లక్ష్మణ్ కొల్లూరి ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 7గంటలకు తిలక్‌రోడ్డులోని తమ హాస్పటల్ నుంచి ఐఎంఏ హాలు వరకూ ఈ 3కే నడక నిర్వహించనున్నట్టు తెలిపారు.

రేపు ఆర్యాపురం బ్యాంక్ సాధారణ సమావేశం

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 27: ది ఆర్యాపురం కోఆపరేటివ్ బ్యాంక్ సాధారణ మహాజన సభను ఆదివారం ఎస్‌కేవీటీ డిగ్రీకళాశాలలో నిర్వహిస్తున్నామని ఆ బ్యాంక్ చైర్మన్ చల్లా శంకరావు తెలిపారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. బ్యాంకు సభ్యులంతా బ్యాంకు మంజూరుచేసిన మెంబరు షిప్ కార్డుతో పాటు ఆధార్ కార్డు తీసుకుని హాజరుకావాలన్నారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు పాల్గొన్నారు.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి

తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
శనివారం 28 సెప్టెంబరు 2024 | 5



ఇసుగెత్తి!.. పోతున్నారు!



- త్రిశంకు స్వర్గంలో ఉచిత ఇసుక
- ప్రభుత్వం ప్రకటించినా అందని వైనం
- పట్టువీడని నాయకులు.. అధికారులు..
- ఇసుక కొరతతో ఆగిన భవన నిర్మాణాలు
- ఆన్‌లైన్ అమలులో ఉన్నా ఇసుక తీయని వైనం

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఇసుక కష్టాలు తీరడంలేదు.. గోదావరి తగ్గుముఖం పట్టినా ఇసుక తీత ఆరంభంకాలేదు.. నేడు రేపు అంటూ నెట్టుకొస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నప్పటికీ జిల్లాలో అధికారులు, ప్రజాప్రతినిధుల వైఖరి వల్ల ప్రజలకు ఇసుక దొరకని పరిస్థితి ఏర్పడింది. ఈ నెల 11 నుంచి ఆన్‌లైన్ విధానం అమల్లోకి వచ్చినా జిల్లాలో ఇంత వరకూ ఇసుక సరఫరా ఆరంభించలేదు. నిబంధనలు కఠినంగా అమలు చేయాలని అధికార యంత్రాంగం, తమ పార్టీ శ్రేణులకు కనీస ఆదాయం అయినా రప్పించాలని ప్రజా ప్రతినిధులు భీష్మించుకుని కూర్చోవడంతో సమస్య జఠిలంగా మారింది. అధికారుల మధ్య సమన్వయ లోపం కనిపిస్తోంది. దీంతో జిల్లాలో ఇసుక కొరత తీవ్రమైంది. ఇంత వరకూ వరదల వల్ల ఆలస్యమైతే ఇపుడు నిబంధనలు, పట్టుదల వల్ల ఆలస్యమవుతోంది. ఇదిలా ఉంటే అధికారికంగా ఆర్డర్ ఇవ్వనప్పటికీ కొవ్వూరు మండలం ఆరికరేవులలో రెండు ర్యాంపుల్లో ఇసుక గుట్టలు పెడుతున్నారు. గోదావరిలో ఇసుక ఇష్టానుసారం తవ్వేస్తున్నా రు. జిల్లాలో ఇసుక తీయడానికి 9 డీసిల్టేషన్ పాయింట్లు గాయత్రిలో రెండు,కోటిలింగాల ఒకటి, కొవ్వూరు వైపు 6 గుర్తించారు. ఈ పాయింట్లలో ఇసుక తీయడానికి 48 బోట్స్‌మన్ సొసైటీలను గుర్తించారు.ఇందులో అధికార కూటమి శ్రేణులకు సంబంధించినవే ఎక్కువ ఉన్నట్టు సమాచారం. ఈ సారి ఇసుక సరఫరాపై గట్టి నిఘా పెడుతున్నారు. ప్రతి రోజు ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ ఇసుక రీచ్‌ల వద్దకు వాహనాలను అనుమతిస్తామన్నారు. అక్రమ ఇసుక రవాణా అరికట్టడానికి వీలుగా వినియోగదారుడి వివరాల ఆధారంగా క్రాస్ చెక్ చేసే వ్యవస్థను అమల్లోకి తెచ్చారు.సీసీ కెమెరాలుఏర్పాటు,బయోమెట్రిక్ గుర్తింపు వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నారు.

రవాణా చార్జీలిలా!

- **ట్రాక్టర్ :** ర్యాంపు నుంచి 10 కిలోమీటర్ల వరకూ 4.5 టన్నుల ఇసుక ట్రాక్టర్‌కు రూ.13.5లు రవాణా చార్జీగా నిర్ణయించారు. తర్వాత 11 నుంచి 20 కిలోమీటర్ల వరకూ రూ.12.8, 21 నుంచి 30 కి.మీ వరకూ రూ.12.8, 31 నుంచి 40 వరకూ రూ.12.8, 40 నుంచి 80 కి.మీ వరకూ రూ.6.3 మాత్రమే వసూలు చేస్తారు.
- **10 టన్నుల ఇసుక ఆరు టైర్ల ట్రక్కు :** ఇసుక పాయింట్ నుంచి 10 కిలోమీటర్ల రూ.10.7, 11 నుంచి 20 కిలోమీటర్ల వరకూ రూ.10.2 , 21 నుంచి 30 కిలోమీటర్ల వరకూ 10.2 రూపాయలు, 31 నుంచి 40 వరకూ రూ.10.2, 40 నుంచి 80 కిలోమీటర్ల వరకూ 6.3 రూపాయలు వసూలు చేయాలన్నారు.
- **10, 12, 14 టైర్ల లారీలు :** 18 టన్నులు, 20 టన్నులు, 25 టన్నులు,30 టన్నులు, 35 టన్నుల ఇసుక తీసుకుని వెళ్లినా పాయింట్ నుంచి 10 కిలోమీటర్ల వరకూ కిలోమీటరు రూ.9.4, 11 నుంచి 20 కిలోమీటర్ల వరకూ రూ.8.9, 21 నుంచి 30 కిలోమీటర్ల వరకూ రూ.8.9, 31 నుంచి 40 కిలోమీటర్ల వరకూ రూ.8.9, 40 నుంచి 80 కిలోమీటర్ల వరకూ రూ.6.3 వసూలు చేయాలి.ఇక 80 కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరం ఉంటే కిలోమీటరుకు రూ.35 అదంగా వసూలు చేయవచ్చని నిర్ణయించారు.

10 టన్నుల ఇసుక రూ.3600

ఇసుక తవ్వకం, లోడింగ్ రూ.30, రీలోడింగ్‌కు రూ.30, సీనరేజి రూ.66, జీఎస్టీ 18 శాతం, డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ (డీఎంఎఫ్) రూ.19.68, మెరిట్(ఖనిజాన్వేషన్ నిధి) 2 శాతం వసూలు చేస్తారు. లబ్ధిదారుడు రవాణా చార్జీలు పెట్టుకోవాలి. ర్యాంపుల్లో ఒక పైసా కూడా అదనంగా తీసుకోవడానికి వీలులేదు. కొందరు రవాణా చార్జీల పేరిట ఎక్కువ వసూలు చేస్తున్నట్టు స్టాక్ పాయింట్లలో తేలడంతో రవాణా చార్జీలను ప్రభుత్వమే నిర్ణయిస్తూ జీవో జారీ చేసింది. ఆ ప్రకారమే వాహనదారులు ఇసుకను సరఫరా చేయాలి.దీంతో 10 టన్నుల లారీ ఇసుక రూ. 3600 అవుతుంది. ప్రస్తుతం డీసిల్టేషన్ వల్ల ఈ ధర ఎక్కువ కనిపిస్తోంది. ఓపెన్ ర్యాంపులు మొదలైతే బోట్స్‌మన్ సొసైటీలకు ఇచ్చే డబ్బులు మిగులుతాయి. ధర తగ్గుతుంది.

ఏడీబీ రోడ్డు.. ఎవరికి పట్టేను!



దీని పేరు ఏడీబీ రోడ్డు.. ఈ పేరు వింటే అమ్మో అనక మానరు.. ఎందుకంటే ఎక్కడ రోడ్డుందో.. ఎక్కడ గొయ్యుందో తెలియదు.. గత ఐదేళ్లగా ఇంతే. ఈ రోడ్డులో ప్రయాణికులు ప్రత్యక్ష నరకమే చూస్తున్నారు.. అయినా నేటికీ తీరు మారలేదు.. ఇప్పటికీ పడుతూ.. లేస్తూ వెళ్లాల్సిందే మరి..ఈ చిత్రంలోనే ఒక గోతిలో కారు ఎలా మునిగిందో.. కూటమి ప్రభుత్వంలోనైనా రోడ్డు పడుతుందని ఆశగా ఎదురుచూస్తున్నారు.. - రాజానగరం



నగరం.. అందునా జిల్లా కేంద్రం.. రోడ్లన్నీ సాఫీగా ఉంటాయనుకుంటే పొరబడినట్టే మరి.. చూసుకుని వెళ్లకపోతే పాతాళానికి పడిపోతారు.. కనిపించకుండా పోతారు..ఈ చిత్రంలోనే చూశారా.. ఇదెక్కడిదో గమనించారా..! షెల్టాన్ హోటల్ సమీపంలో రోడ్డు.. అక్కడ ఇటువంటి గొయ్యి చూడలేదే అనుకుంటున్నారా.. చిన్న చినుకు పడినా చాలు ఇటువంటి గోతులు బోలెడన్ని బయటపడతాయి.. ఎందుకంటే గతంలో మన మునిసి పల్ అధికారులు పనులు అంత నాణ్యతగా చేసి పైన తారుపూశారు మరి.. రాజమహేంద్రవరం శీలం నూకరాజు కాంప్లెక్స్ - షెల్టాన్ రోడ్డులో ఎస్‌టీపీ ప్లాంట్ కు వెళ్లే మురుగునీటి పైప్‌లైన్ పగిలి శుక్రవారం సాయంత్రం రోడ్డు కుంగింది. దీంతో ఈ అగాధం కాస్తా బయటపడింది.. ఏ అర్ధరాత్రి సమయంలో మంచి వర్షం పడుతుండగా ఇలా జరిగి ఉంటే అంతే సంగతి మరి.. ఈ పైప్‌లైన్‌కు గతంలో బైపాస్‌రోడ్డు జంక్షన్ నుంచి గోరక్షణపేట వైపు వెళ్లే ప్రధాన మార్గంలో పగిలి చాలా వరకు రోడ్డు కుంగిపోయింది. అప్పట్లో రోజుల తరబడి రిపేరుచేసి రోడ్డును ఇంత అందంగా పూడ్చారు. - రాజమహేంద్రవరం సిటీ

ఇవీ రోడ్లేనా!?



జిల్లా వ్యాప్తంగా రహదారులు దారుణంగా ఉన్నాయి.. ఎటు వెళ్లినా ఇంతే.. వెళుతుంటే చింతే.. ప్రధాన రహదారి అయినా.. గ్రామాల్లో అయినా దారిద్ర్యమే.. గత ఐదేళ్లలో వైసీపీ పాలకులు రోడ్లను పట్టించుకోవడమే మానేశారు.. దీంతో మరీ అధ్వానంగా తయారయ్యాయి. నిత్యం రద్దీగా ఉండే రాజానగరం - సామర్లకోట ఏడీబీ రోడ్డు ఉందా అంటే ఉంది అంతే.. వెళ్లడానికి పనికొస్తుందా అంటే కాస్త ఆలోచించాల్సిందే మరి.. జిల్లా కేంద్రంలో రహదారుల సంగతి ఏంటా అంటే.. అక్కడా అంతే మరి.. మండల కేంద్రాల్లో బాగున్నాయా అంటే అదీ లేదు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ఎక్కడ చూసినా ఇవీ రోడ్లేనా అనక మానరు మరి..!?

ఇదే మా హెచ్చరిక?

ప్రస్తుతం రోడ్లపై చూసుకుని వెళ్లకపోతే అంతే.. ఎందుకంటే రోడ్లు అలా ఉన్నాయి మరి.. గత ఐదేళ్లగా వైసీపీ ప్రభుత్వంలో పట్టించుకోకపోవడంతో నేడు రోడ్లన్నీ గోతులతో నిండి అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. ఈ చిత్రంలోనే చూడండి..ఈ రోడ్డు ఎక్కడి దో తెలుసా.. కొవ్వూరు డివిజన్ కేంద్రానికి చేరువగా ఉన్న తాళ్లపూడి మండలం కేంద్రంలో ప్రధాన రహదారి.. అయినా ఇంతే. చాలా కాలంగా ఇక్కడ గొయ్యి ఉంది.. అధికారులు పట్టించుకోకపోవడంతో పెరిగి పెద్దదైపోయింది.. ఈ గొయ్యి గురించి తెలియక చాలా మంది ప్రమాదానికి గురయ్యారు.. అధికారులకు ఫిర్యాదు చేసినా కనీసం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపో వడంతో స్థానికులే ఇలా కర్రపెట్టి హెచ్చరిక చేస్తున్నారు. అయ్యా అధికారులు ఇకనైనా మేల్కొండి మరి.. - తాళ్లపూడి



నాట్యమయూరాలు.


పర్యాటకరంగ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులతో కలెక్టర్ ప్రశాంతి

పర్యాటక అభివృద్ధికి కృషి : కలెక్టర్

దివాన్‌చెరువు, సెప్టెంబరు 27 : పర్యాటక అభివృద్ధికి పాటుపడదామని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పిలుపునిచ్చారు.ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఆదికవి నన్నయ వర్సిటీలో శుక్రవారం సాయంత్రం జరిగిన జిల్లాస్థాయి కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. రాజమహేంద్రవరం నగరానికి ఎంతో చారిత్రక ప్రసిద్ధి ఉందని.. దీనిని పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పర్యాటకశాఖ ప్రాంతీయ డైరెక్టర్ వి.స్వామినాయుడు మాట్లాడుతూ అఖండ గోదావరి ప్రాజెక్టులో భాగంగా రూ. 100 కోట్లతో పురుషోత్తమపట్నం, బ్రిడ్జిలంక, కడియంలలో ఎకో టూరిజం, క్రూజ్‌టూరిజం, అడ్వెంచర్ టూరిజం ప్రతిపాదించామన్నారు. వివిధ పోటీల్లో విజేతలకు కలెక్టర్ బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో వర్సిటీ వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు, జిల్లా పర్యాటక అధికారి పి.వెంకటాచలం, రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, కామర్స్ విభాగాధిపతి ఎస్.ఉదయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ముంచిన వాన



వానొచ్చింది.. ముంచేసింది.. జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఉదయం ఒక్కసారిగా వానొచ్చిపడింది.. సుమారు మూడు గంటల పాటు ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో పల్లపుప్రాంతాలు జలమయమయ్యాయి. ఉదయమే వర్షం కురవడంతో పాఠశాలలకు వెళ్లే చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రాజమహేంద్రవరంలో పలు వీధులు కాలువల్లా మారిపోయాయి. సీపీఐ నాయకులు ముంపు ప్రాంతాను పరిశీలించారు. -రాజమహేంద్రవరం అర్బన్

చిరుత..ఎక్కడున్నావ్! 8

జిల్లా దేవాదాయ అధికారిగా నాగేశ్వరరావు



రాజమహేంద్రవరం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా దేవాదాయ అధికారి (డీఈవో)గా రాజ మహేంద్రవరం కార్యాలయంలో కె.నాగేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ ఉప కమిషనర్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తూ పదోన్నతిపై ఇక్కడికి బదిలీ అయ్యారు.ఈ స్థానంలో ఉన్న వి.సోమరాజు ఉప కమిషనర్ కార్యాలయ సూపరింటెండెంట్‌గా వెళ్లారు.కార్యక్రమంలో జిల్లా ఎండోమెంట్ ఆఫీస్ సూపరింటెండెంట్ శ్రీనివాసాచార్యులు, అర్చక సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా నిబంధనలు మీరితే జైలుకే : ఎస్పీ

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అనుమతులు పొందినవారు మాత్రమే నిబంధనలకు లోబడి బాణసంచా తయారీ, విక్రయాలు నిర్వహించాలని ఎస్పీ నరసింహ కిశోర్ పేర్కొన్నారు. ఉల్లంఘనలకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ మేరకు పటిష్ట నిఘా పెట్టామని, విస్తృతంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. బాణసంచా గోదాములు, దుకాణాలు, తయారీ కేంద్రాలు నివాస ప్రాంతాలకు నిర్దేశించిన దూరంలో ఉండాలన్నారు. ముందస్తు జాగ్రత్తలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా అనుమతుల్లేకుండా రహస్య బాణాసంచా తయారీ, నిల్వ, విక్రయాలపై 112కి డయల్ సమాచారం ఇవ్వాలన్నారు.

స్కూల్ బస్.. ఫిట్‌లెస్!

అనపర్తిలో స్టీరింగ్ ఫెయిల్.. త్రుటిలో తప్పిన పెనుప్రమాదం

అనపర్తి, సెప్టెంబరు 27 : స్కూల్ బస్‌కు త్రుటిలో పెనుప్రమాదం తప్పింది.ఫిట్‌నెస్ ఎంత ఫిట్‌లెస్‌గా ఉందనేది తెలియజేసింది.. మండపేటలోని ఒక ప్రైవేట్ కళాశాలకు చెందిన బస్సు శుక్రవారం రాత్రి ఏడుగురు విద్యార్థులతో అనపర్తి రైల్వే ఫ్లయ్ ఓవర్ మీదుగా బాబా నగర్ వైపు వస్తుంది.అయితే బస్సు స్టీరింగ్ ఫెయిల్ కావడంతో బస్సు ఒక్కసారిగా అదుపుతప్పి ఫుట్‌పాత్ మీదుగా రెయిలింగ్‌ను ఢీకొట్టి ఆగింది. అప్పటికే బస్సు దిగేందుకు ప్రయత్నిస్తున్న విద్యార్థి ఒక్కసారిగా వెనుకకు బస్సులో పడడంతో ప్రమాదం తప్పింది.అదే ముందుకు పడి ఉంటే పెద్ద ప్రమా దమే జరిగేది. సమాచారం అందుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు అక్కడికి చేరుకుని తమ పిల్లలు క్షేమంగా ఉన్నారని తెలుసుకుని ఊపిరి పీల్చుకున్నారు.కండీషన్‌లో లేని బస్సులతో విద్యా ర్థుల ప్రాణాలతో చెలగాటమాడ తారా అంటూ విద్యార్థుల తల్లిదం డ్రులు ఆందోళన వ్యక్తం చేశారు.సమాచారం అందుకున్న ఎస్‌ఐ శ్రీను నాయక్ అక్కడికి చేరుకుని విద్యార్థుల వివరాలు తెలుసుకున్నారు. కండీషన్ సరిగా లేని స్కూల్ బస్సులపై ఆర్‌టీఏ అధికారులు చర్య లు తీసుకోవాలని కోరుతున్నారు.

రెక్కలు.. ముక్కలు..



పంకా పక్కచూపులు

- కూటమి వైపు నాయకుల చూపు
- ఇప్పటికే పలువురి ప్రయత్నం
- సైలెంట్‌గా ఉన్న ప్రధాన నేతలు
- మాజీ ఎంపీ భరత్ కినుక
- నిడదవోలులో ముక్కలైన కౌన్సిల్
- చైర్మన్ తీరుపై తీవ్ర అసహనం
- రాజీనామా చేయాలని డిమాండ్
- వైసీపీ కౌన్సిలర్ల వాకౌట్
- ఇంకా ఆరంభంకాని ఆకర్ష్
- అదే జరిగితే వైసీపీ ఖాళీ

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

వైసీపీ నాయకులు కూటమి వైపు చూస్తున్నారు.. ప్రధాన నాయకులు పార్టీ మారేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు.. గేట్లు తెరిస్తే చాలు జంప్ అవ్వడానికి సిద్ధంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో వైసీపీకి భారీ షాక్ తగలనుంది. ఇప్పటికే కొందరు పార్టీ మారగా, ప్రస్తుతం రాజమహేంద్రవరం మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో పలువురు మాజీ కార్పొరేటర్లు, వైసీపీ నేతలు పార్టీ మారనున్నారు. వైసీపీ మాజీ కార్పొరేటర్లు, నాయకులు సుమారు 15 మంది వరకూ గురువారం రాత్రి జనసేన రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జి అనుశ్రీ(అత్తి) సత్యనారాయణను కలసి తాము జనసేనలో చేరడానికి సిద్ధంగా ఉన్నట్టు చెప్పడం గమనార్హం. మాజీ కార్పొరేటర్లు మానే దొరబాబు, 21వ డివిజన్ సత్యనారాయణ, నేతలు మజ్జి అప్పారావు, నరవ గోపాలకృష్ణ, మంచాల బాబ్జి ఇంకా పలువురు మాజీ కార్పొరేటర్లు ఉన్నట్టు సమాచారం. మంత్రి దుర్గేష్, అధినేత పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లి చేరికలపై నిర్ణయం తీసుకుంటామని అనుశ్రీ సత్యనారాయణ చెప్పినట్టు ప్రచారం జరుగుతోంది. దీనిపై వైసీపీలో తీవ్ర చర్చనీయాంశమైంది. జిల్లా వైసీపీ అధ్యక్షుడిగా మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు శనివారం బాధ్యతలు స్వీకరించనున్న సమయంలో పలువురు వైసీపీ నేతలు, మాజీ కార్పొరేటర్లు జనసేనలో చేరడానికి ముందుకు రావడం చర్చనీయాంశమైంది. ఇతర నేతల్లో కూడా సంతృప్తి లేదు.జిల్లాలో కీలకనేత, వైసీపీ ప్రభుత్వ సలహాదారుగా పనిచేసిన ప్రముఖ పారిశ్రామికవేత్త కొవ్వూరుకు చెందిన రాజీవ్‌కృష్ణ ఇటీవల సైలెంట్‌గా ఉన్నారు. ఆయన మాజీ మంత్రి పెండ్యాల కృష్ణబాబు అల్లుడు. ఏపీఐసీ మాజీ చైర్మన్ శ్రీఘా కోళ్లపు శివరామసుబ్రహ్మణ్యం పార్టీకి దూరంగా ఉన్నారు.రుడా మాజీ చైర్మన్ మేడపాటి షర్మిళారెడ్డి సైలెంట్‌గానే ఉన్నారు. మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్య ప్రకాశరావు, చందన నాగేశ్వర్ పరిస్థితి అంతే.జిల్లాలో కాస్త యాక్టివ్‌గా ఉండే రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను జిల్లా అధ్యక్ష పదవి నుంచి తప్పి రాష్ట్ర వైసీపీ యువజన విభాగం అధ్యక్షుడిగా నియమించడంతో ఆయన ఈ ప్రాంతంలో పెద్ద దృష్టిపెట్టే పరిస్థితి తక్కువే. ఇక రాజమ హేంద్రవరం మాజీ ఎంపీ మార్గాని భరత్ ఉక్రోశంతో ఉన్నట్టు తెలుస్తోంది. ఆయనకు సిటీ సమన్వయకర్త పదవి ఇవ్వకుండా సిటీ ప్రెసిడెంట్ పదవి ఇవ్వడంతో కినుక వహించినట్టు సమాచారం.మరొక పక్క నిడదవోలు మునిసిపల్ చైర్మన్ భూపతి ఆదినారా యణ,అక్కడి మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడి మధ్య దూరం పెరిగింది.చైర్మన్ జనసేనకు దగ్గరగా ఉంటున్నట్టు వైసీపీ కౌన్సిలర్లు కొందరు ఆరోపిస్తున్నారు. అయితే ఇప్పటి వరకూ కూటమి చేరికలకు పెద్దగా అనుమతి వ్వలేదు. ఇప్పుడిప్పుడే వచ్చేవారిని ఆహ్వానిస్తున్నారు. ఇటీవల రాష్ట్రంలో వైసీపీ నేతలు వరుసగా జైలుకు పోవడం,ఇటీవల తిరుపతి లడ్డు కల్తీ వ్యవహారం వైసీపీని బాగా ఇరకాటంలో పెట్టాయి. పైగా వైసీపీ అధికారంలో ఉన్నపుడు కార్యకర్తలను పట్టించుకో కపోవడం ఇవాళ ఆ పార్టీ మనుగడే ప్రశ్నార్థకం అవుతోంది. కొంత మంది కాంగ్రెస్‌లో చేరడానికి ప్రయత్నాలు చేస్తున్నారు.టీకే.విశ్వేశ్వరరెడ్డి ఇటీవల వైసీపీకి గుడ్‌బై చెప్పి కాంగ్రెస్‌లో చేరడంతో పాటు జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి కూడా చేపట్టిన సంగతి తెలిసిందే.గత సార్వత్రిక ఎన్నికల్లో రాజమహేంద్రవరం పార్లమెంటరీ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన పీసీసీ మాజీ అధ్యక్షుడు, ఏఐసీసీ వర్కింగ్ కమిటీ సభ్యుడు గిడుగు రుద్రరాజు వైసీపీ నుంచి కొందరిని ఆకట్టుకునే ప్రయత్నాలు చేస్తుండడం కూడా వైసీపీకి ఇబ్బంది కరంగా మారింది. కూటమి ద్వారాలు తెరిస్తే వైసీపీ ఖాళీ అయ్యే పరిస్థితి కనిపిస్తుంది.

నిడదవోలులో రచ్చకెక్కిన విభేదాలు

నిడదవోలు, సెప్టెంబరు 27 : నిడదవోలు వైసీపీలో మునిసిపల్ చైర్మన్ కుర్చీ కుమ్ములాట మరోసారి రచ్చకెక్కింది. ఒకరేమో చైర్మన్ కుర్చీ దిగనంటే.. మరొకరు చైర్మన్ కుర్చీ నాకు ఇవ్వాల్సిందే అంటూ పట్టుబడుతున్నారు. ఇదిలా ఉండగా శుక్రవారం నిడదవోలు మునిసిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని పలు కౌన్సిలర్లు బాయ్‌కట్ చేయడం చర్చనీయాంశమైంది. మునిసిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ కౌన్సిల్ అజెండాలోని అంశాలను సభ్యులతో చర్చించకుండానే సమావేశానికి తీసుకురావడాన్ని కౌన్సిలర్ కామిశెట్టి సత్యనారాయణ నిలదీశారు. మరో కౌన్సిలర్ పువ్వల రతీదేవి మాట్లాడుతూ కౌన్సిల్‌లో ప్రజాసమస్యలు అధికారుల దృష్టికి వెళ్లకుండా చైర్మన్ అడ్డుపడుతున్నారన్నారు. అజెండాలోని ఏ ఒక్క అంశం కౌన్సిల్ సభ్యులకు తెలియకుండా చైర్మన్ ఏకపక్షంగా వ్యవహ రిస్తున్నారని మండిపడ్డారు.కౌన్సిల్ సమావేశాన్ని వాయిదా వేయాలని డిమాండ్ చేస్తూ కౌన్సిల్ సభ్యులు సమావేశం నుం చి వాకౌట్ చేశారు. మొత్తం 28 మంది కౌన్సిల్ సభ్యులు ఉండగా వైకాపా కౌన్సిలర్లు ఇద్దరు, చైర్మన్ భూపతి ఆది నారాయణ,మరొక టీడీపీ కౌన్సిలర్ ఒక్కరు మాత్రమే కౌన్సిల్ హాలులో మిగిలారు. 22 మంది కౌన్సిలర్లు చైర్మన్ భూపతి ఆదినారాయణ విధానాలను వ్యతిరేకిస్తూ కౌన్సి ల్ సమావేశం నుంచి బయటకు వచ్చేశారు. పెద్దల ఒప్ప ందం ప్రకారం చైర్మన్ భూపతి ఆదినారాయణ పదవికి రాజీనామా చేయాల్సి ఉందన్నారు. అయినా రాజీనామా చేయకుండా అధికార పార్టీతో కలసి నడుస్తు న్నారని విమర్శించారు.


స్వపక్షంలో..విపక్షం : నిడదవోలు కౌన్సిల్ సమావేశాన్ని వాకౌట్ చేసిన వైసీపీ కౌన్సిలర్లు

తేలని పెద్ద మనుషుల ఒప్పందం

2021 మునిసిపల్ ఎన్నికల్లో ఇద్దరు వైసీపీ కౌన్సిలర్లు చైర్మన్ పదవికి పోటీపడగా అప్పటి ఎమ్మెల్యే జి.శ్రీనివా స్ నాయుడు ఇరువురి మధ్య ఒక ఒప్పందం చేశారు. 25వ వార్డు వైసీపీ కౌన్సిలర్ భూపతి ఆదినారాయణ రెండున్నర ఏళ్ళు21వ వార్డు వైసీపీ కౌన్సిలర్ కామిశెట్టి సత్యనారా యణ రెండేళ్లు,మరో మహిళా కౌన్సిలర్ పువ్వల రతీదేవి ఆరు నెలలు చైర్మన్ బాధ్యతలు చేప ట్టేలా పెద్ద మనుషుల ఒప్పందం కుదుర్చుకున్నారు. అ యితే మునిసిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ నేటికి రాజీనామా చేయకపోవడంతో వైసీపీలో విభేదాలు వీధికె క్కాయి.ఆనాడు పెద్ద మనిషిగా వ్యవహరించిన మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు చైర్మన్ కుర్చీ లాటలో తల బొప్పి కట్టి ఎటూ తేల్చలేక కూర్చున్నారు. చైర్మన్ పదవికి రాజీనామాపై భూపతి ఆదినారాయణను వివరణకోరేందుకు ఫోన్‌లో ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

చైర్మన్ రాజీనామా చేయాలి : కామిశెట్టి



2021లో జరిగిన ఒప్పందం ప్రకారం భూపతి ఆదినారాయణ చైర్మన్ పదవికి రాజీనామా చేయాలి.మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడుకు, చైర్మన్‌కు అంతరంగిక వ్యవహారాలు చక్కపడినా రాజీనామా చేయకపోవడం సరికాదు. ఇప్పటికైనా రాజీనామా చేసి మాటనిలబెట్టుకోవాలి.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

రూ.30 లక్షలతో జలజీవన్ పనులు



నల్లజర్ల, సెప్టెంబరు 27: నల్లజర్ల మండలం తూర్పు చోడవరంలో జల జీవన్ మిషన్ పథకంలో సురక్షిత మంచినీటి పైపులు వేసేందుకు రూ.30 లక్షలు మంజూరైనట్టు ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈ గిరి అన్నారు. శుక్రవారం నల్లజర్ల మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న జల జీవన్ పనులను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కొన్ని గ్రామాల్లో పనులు పూర్తి కాగా మరికొన్ని గ్రామాల్లో పనులు ప్రారంభిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీఈ అప్పారావు, ఏఈ అజేయ్‌బాబు, సర్పంచ్ శంకవరపు వెంకటలక్ష్మి, వైస్ సర్పంచ్ ఉండవల్లి గోపి, కార్యదర్శి శ్రీనివాస్, వార్డు సభ్యులు ఉప్పు నరేష్, చిక్కాం అన్నవరం, కోడిచుక్కల గంగయ్య పాల్గొన్నారు.

బాణసంచా నిల్వ చేస్తే కఠిన చర్యలు



బాణసంచా కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ దేవకుమార్, సీఐ శ్రీనివాస్

నల్లజర్ల, సెప్టెంబరు 27: అనుమతులు లేకుండా అక్రమంగా బాణసంచా నిల్వ ఉంచినా లేక విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ హెచ్చరించారు. శుక్రవారం నల్లజర్ల మండలం తెలికిచర్ల, ప్రకాశరావుపాలెంలో ఉన్న బాణసంచా గొడౌన్లలో సోదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాణసంచా కొనుగోలు చేసినా లేక విక్రయించిన వ్యాపారులపై కేసులు నమోదు చేస్తామన్నారు. రానున్న దసరా పండుగల పేరుతో అసాంఘిక కార్యకలాపాలు, కోడి పందాలు, పేకాట నిర్వహిస్తే కఠిక చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట సీఐ శ్రీనివాస్, ఎస్ఐ శ్రీహరి బాబు ఉన్నారు.

డివిడెండ్ చెల్లించేందుకు ఆమోదం

కొవ్వూరు, సెప్టెంబర్ 27: పశివేదల రంగరాయ సొసైటీ సభ్యులకు షేరు ధనముపై 15 శాతం డివిడెండ్ చెల్లించేందుకు మహాజన సభ ఆమోదించినట్టు సొసైటీ కార్యదర్శి కరుటూరి శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం కొవ్వూరు మండలం పశివేదల ది రంగరాయ విశాల సహకార పరపతి సంఘం మహాజన సభ అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జి, కోఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ కె.నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. సంఘం సాలుసరి నివేదికను సంఘ కార్యదర్శి కరుటూరి శ్రీనివాస్ సభ్యులకు సమర్పించారు. తక్కువ ధరకే ఎరువులు విక్రయింస్తామన్నారు. కార్యక్రమంలో రైతులు గారపాటి రామచంద్రరావు, గారపాటి శ్రీనివాసరావు, పరిమి సోమరాజు, రైతులు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఆరికిరేవుల సొసైటీ సభ్యులకు కూడా: ఆరికిరేవుల సొసైటీ సభ్యులకు షేరు ధనంపై 15 శాతం డివిడెండ్ చెల్లించేందుకు మహాజన సభ ఆమోదించినట్టు సొసైటీ కార్యదర్శి చావా ప్రసాద్ తెలిపారు. కొవ్వూరు మండలం ఆరికిరేవుల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం మహాజన సభ శుక్రవారం అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జి, కోఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎం.దుర్గాకుమారి అధ్యక్షతన నిర్వహించారు. సంఘం సాలుసరి నివేదికను సంఘ కార్యదర్శి చావా ప్రసాద్ సభ్యులకు సమర్పించారు. ఆయన మాట్లాడుతూ సొసైటీలో రైతులకు తక్కువ ధరకే ఎరువులు విక్రయిస్తామన్నారు కార్యక్రమంలో చావా శ్రీనివాసరావు, రైతులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.



అవగాహన ఒప్పందంలో సీటీఆర్ఐ డైరెక్టర్ మాగంటి శేషుమాధవ్

పొగాకు, ఇతర పంటలపై పరిశోధనకు ఒప్పందం

సీటీఆర్ఐ డైరెక్టర్ మాగంటి శేషుమాధవ్

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 27: కేంద్ర పొగాకు పరిశోధనా సంస్థ (సీటీఆర్ఐ) రాజమహేంద్రవరంలో పొగాకుతోపాటు పసుపు, మిరప, అశ్వగంధ, ఆముదం పంటలపై సంయుక్త పరిశోధనలు చేసేందుకు అవగాహన ఒప్పంద సంతకాలు చేసినట్టు డైరెక్టర్ మాగంటి శేషుమాధవ్ తెలిపారు. శుక్రవారం సీటీఆర్ఐలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు, మార్కెటింగ్‌పై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రైతు సాధికార సంస్థ (ఏపీసీఎన్ఎఫ్) అవగాన ఒప్పందం జాతీయ వాణిజ్య పంట పరిశోధన సంస్థ(ఎన్ఐఆర్‌సీఏ)గా రూపాంతరం చెందిన సీటీఆర్ఐతో చేసుకుందని చెప్పారు. కార్యక్రమంలో ఏపీసీఎన్ఎఫ్ జిల్లా ప్రాజెక్టు మేనేజరు బి.తాతారావు, అడిషనల్ డీపీఎం షేక్ వలి, భువి ఎన్జీవో సంస్థ అధికారి నరసింహరావు, కేవీకే కలవచర్ల హెడ్ వీఎస్‌జీఆర్ నాయుడు, సీటీఆర్ఐ విభాగాధిపతులు, ఐటీఎంయూ నోడల్ ఆఫీసర్ హెచ్.రవిశంకర్, పలువురు రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొవ్వూరు వ్యవసాయశాఖ ఏడీ చంద్రశేఖర్

సకాలంలో ధాన్యం కొనుగోలుకు సిద్ధంకావాలి

చాగల్లు, సెప్టెంబరు 27: రైతులు పండించిన ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేసేలా అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని కొవ్వూరు వ్యవసాయశాఖ ఏడీ పి.చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో తహశీల్దార్ ఎం.మెరికమ్మ, ఇన్‌చార్జి ఎంపీడీవో నిర్మలకుమారి, మండల వ్యవసాయ అధికారి వేణుగోపాలకృష్ణ, పౌరసరఫరాల డీటీ సునీత, సొసైటీ కార్యదర్శులు, కస్టోడియన్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



పసలపూడిలో పంట పొలం వద్ద అధికారులు, రైతులు

ఉండ్రాజవరం, సెప్టెంబరు 27: వరి పంట సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని ఏరువాక కేంద్ర జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు పేర్కొన్నారు. మండలంలోని పసలపూడి గ్రామంలో శుక్రవారం సస్యరక్షణపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం శాస్త్రవేత్త మానుకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ సమగ్ర పోషక యాజమాన్యం పాటించాలన్నారు. తొలుత పంట పొలాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏవో ఎమ్.విశ్వాసరావు, రైతులు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయాలి

ఉండ్రాజవరం, సెప్టెంబరు 27: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయడానికి సాంకేతిక పరిజ్ఞానం అవసరమని సత్యవాడ హైస్కూలు ప్రధానోపాధ్యాయురాలు బి.సూర్యకాంతం పేర్కొన్నారు. శుక్రవారం పదో తరగతి విద్యార్థులకు చౌదరి స్పిన్నింగ్ ఫ్యాక్టరీకి అగ్రికల్చర్ ఇండస్ట్రియల్ టూర్‌కు తీసుకువెళ్లారు. ఫ్యాక్టరీ హెచ్ఆర్ సరిత విద్యార్థులకు స్పిన్నింగ్ దశలను చూపించి వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు, ఫ్యాక్టరీ ఉద్యోగులు ప్రశాంత్, హరి తదితరులు పాల్గొన్నారు.





కడియం ఆవ ప్రాంతంలో రైతులు, గ్రామస్థులతో మాట్లాడుతున్న అటవీశాఖ అధికారులు. పక్క చిత్రంలో సీసీ కెమేరాలు పరిశీలిస్తున్న అధికారులు

చిక్కదు...దొరకదు

కానరాని చిరుతపులి జాడ

ప్రజల్లో భయాందోళన

కడియం, సెప్టెంబరు 27: కొన్ని రోజులుగా చిరుతపులి ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. కడియం నర్సరీ ప్రాంతానికి వచ్చినప్పటి నుంచి దాని జాడ కనిపించక అధికారులు అయోమయానికి గురవుతున్నారు. మంగళవారం కడియపులంక దోసాలమ్మకాలనీ సమీపంలోని నర్సరీలో పులిని చూడటం, అధికారులకు సమాచారం అందించడం జరిగింది. పాదముద్రలు చూసి పులి ఉన్నట్టు అధికారులు కనుగొన్నారు. తరువాత ఎవరూ పులిని చూసిన దాఖలాలు లేకపోగా, సీసీ కెమేరా కు చిక్కడం లేదు. శుక్రవారం కూడా చిరుతపులి జాడ కనిపించలేదు. ఈనెల 26న కనిపించిన ప్రాంతంలో 20 కెమేరాలు ఏర్పాటు చేశారు. రాత్రంతా ఆ ప్రాంతాన్ని చిత్రీకరించాయి. శుక్రవారం కెమేరాలను అధికారులు పరిశీలించినా పులిజాడ కనబడలేదు. ఉదయం నుంచి వర్షం కురవడంతో దాని పాదముద్రలు లేవు. ఇదిలా ఉండగా కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చొప్పెల్ల లాకుల సమీపంలో చిరుతను చూశామని సమాచారం అందడంతో డీఎఫ్‌వో ఎంవీ ప్రసాదరావు తన బృందాన్ని అక్కడకు పంపించారు. అక్కడ కూడా ఎటువంటి ఆనవాళ్లు లేవు. కడియం ఆవ ప్రాంతంలో పులిని చూశామని కొందరు అనడంతో మరో బృందం అక్కడికి వెళ్లింది. అక్కడా ఎటువంటి జాడ కనిపించలేదు. గురువారం రాత్రి దుళ్లలో ఉందని కొందరు, ఏడిదలో ఉందని మరికొందరు సమాచారం ఇవ్వడంతో ఆయా ప్రాంత ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. చిరుతపులి సమాచారం అందించే విషయంలో ప్రతీ ఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలని అధికారులు సూచిస్తున్నారు. పులి పాదముద్రలు ఎక్కడ కనిపించినా వాటి ఫొటోలు, వీడియోలు తీసి అధికారులకు సమాచారమిస్తే అవి పులివో కాదో నిర్ధారణ చేస్తామని అధికారులు పేర్కొన్నారు.

ఆకట్టుకున్న వ్యాసరచన పోటీలు

దేవరపల్లి, సెప్టెంబరు 27: దేవరపల్లి మండలంలో స్వర్ణాంధ్ర 2047 పై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించినట్టు ఎంఈవో తిరుమలదాసు తెలిపారు. ఈ పోటీల్లో దేవరపల్లి సత్యసాయి స్కూల్ విద్యార్థి చిరంజీవి ప్రథమస్థానం, చైతన్య స్కూల్ విద్యార్థిని సాయి ఆశ్రీత 2వ స్థానం, హైస్కూల్ నుంచి లాస్య 3వ స్థానం సాధించారన్నారు. ఈ సందర్భంగా ఎంఈవో విద్యార్థులను అభినందించారు. మండలస్థాయి పోటీల్లో ఎంపికైన విద్యార్థులు రాజమహేంద్రవరంలో జిల్లాస్థాయి పోటీల్లో ఈ నెల 30న పాల్గొంటారని ఆయన తెలిపారు.



అమ్మవారి ఆలయ హుండీని లెక్కిస్తున్న భక్తులు

కోట సత్తెమ్మ హుండీ ఆదాయం లెక్కింపు

నిడదవోలు, సెప్టెంబరు 27: నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం గ్రామంలో నున్న కోట సత్తెమ్మ అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం దేవదాయ ధర్మాదాయ శాఖ తనిఖీదారు ఎ.సృజన్‌కుమార్ ఆధ్వర్యంలో హుండీల సొమ్ము లెక్కింపు నిర్వహిం చారు. ఈ మేరకు 92 రోజులకు అమ్మవారికి మొత్తం రూ.20,85,636 ఆదాయం లభించినట్టు ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి వి.హరిసూర్య ప్రకాష్ తెలిపారు. కాగా హుండీల ద్వారా 10 గ్రాముల బంగారం, 205 గ్రాముల వెండి వచ్చినట్టు ఆయన తెలిపారు. హుండీ లెక్కింపులో ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ అండ్ చైర్మన్ దేవులపల్లి రవిశంకర్, ఆలయ సిబ్బంది, సేవా సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

విజిలెన్స్, ఫుడ్ సేఫ్టీ, మెట్రాలజీ అధికారుల తనిఖీలు

నిడదవోలు, సెప్టెంబరు 27: నిడదవోలు పట్టణంలోని గణపతి సెంటర్‌లో ఉన్న స్వీట్ స్టాల్‌పై శుక్రవారం విజిలెన్స్, ఫుడ్ సేఫ్టీ, మెట్రాలజీ, మున్సిపల్ అధికా రులు తనిఖీలు నిర్వహించారు. తనిఖీల అనంతరం ఫుడ్ సేఫ్టీ అధికారులు బ్రెడ్ అండ్ స్వీట్ శాంపిల్స్ తీసుకోగా అదే ఆవరణ లో ఉన్న వాటర్ ప్లాంట్‌పై కేసు నమోదు చేసినట్టు సమాచారం. నిషేధిత ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తున్న ఈ స్టాల్‌పై కేసు నమోదు చేశారు. ఇక్కడ జరిగిన తనిఖీలకు సంబంధించి విజిలెన్స్, ఫుడ్ సేఫ్టీ అధికారులు ఎటువంటి వివారాలు వెల్లడించలేదు.



స్వీట్‌స్టాల్‌ను తనిఖీ చేస్తున్న దృశ్యం



విద్యార్థుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న జడ్జి సత్యవతి

మదర్ థెరిస్సా హోం తనిఖీ

కొవ్వూరు, సెప్టెంబర్ 27: కొవ్వూరు మదర్‌థెరిస్సా షెల్టర్ హోంను కొవ్వూరు 9వ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. హైకోర్టు ఆదేశాల మేరకు శుక్రవారం కొవ్వూరు సత్యవతినగర్‌లో ఉన్న మదర్‌థెరిస్సా షెల్టర్ హోం, ఆరికిరేవులలో క్రిస్టియన్ చారిటబుల్ సొసైటీలను ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. హోంలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, వసతి, మెనూ వంటి అంశాలను తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడి పలు వివరాలు తెలుసుకున్నారు. అనంతరం హోం రికార్డులను పరిశీలించి, నిర్వాహకులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సొసైటీ పర్సన్ ఇన్‌చార్జ్ ఉషారాణి

సహకార పరపతి సంఘాల కృషి ప్రశంసనీయం

దేవరపల్లి, సెప్టెంబరు 27: వాణిజ్య బ్యాంకులకు దీటుగా సహకార పరపతి సంఘాలు కృషి చేస్తున్నాయని దేవరపల్లి సొసైటీ పర్సన్ ఇన్‌చార్జ్ కే.ఉషారాణి అన్నారు. దేవరపల్లిలో సహకార పరపతి సంఘం మహాజన సభ సొసైటీ కార్యదర్శి కల్లూరి శ్రీనివాస్ శర్మ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఉషారాణి మాట్లాడుతూ సహకార సంఘం ద్వారా రైతులకు సకాలంలో రుణాలు అందిస్తున్నామన్నారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు స్కూల్స్‌లో ప్రథమస్థానం సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామన్నారు. సొసైటీ కార్యదర్శి ఆర్థిక ప్రగతిని రైతులకు వివరించారు. కార్యక్రమంలో మాజీ సొసైటీ అధ్యక్షులు కవల శ్రీనివాస్, కరుటూరి శ్రీనివాస్, రైతులు కొండపల్లి దొరయ్య, యాగంటి బుల్లబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అసౌకర్యం కలుగకుండా చర్యలు

జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభ

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 27: రాజమహేంద్రవరం జీజీహెచ్‌కు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, వాటి సంబంధిత అవసరాల కోసం వస్తున్న దివ్యాంగులకు అసౌకర్యం, జాప్యం లేకుండా అన్ని చర్యలు తీసుకుంటామని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.లక్ష్మీసూర్యప్రభ తెలిపారు. శుక్రవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో దివ్యాంగులతో ఆటలా.. శీర్షికతో ప్రచురితమైన వార్తకు సూపరింటెండెంట్ స్పందిస్తూ, గురువారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల కోసం 71 దరఖాస్తులు వచ్చాయన్నారు. దరఖాస్తులు సమర్పించడానికి దివ్యాంగులతోపాటు వారి బంధువులు, ఇతర జిల్లాల నుంచి కూడా దివ్యాంగులు వస్తున్నారని తెలిపారు. ప్రతి వారం జీజీహెచ్‌లో సదరం, ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, సదరం రిజిస్ట్రేషన్లకు అధిక సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నామన్నారు. అయినా దివ్యాంగులతోపాటు ఓపీ, ఐపీలకు ప్రజల తాకిడి పెరుగుతున్నందున, దీన్ని అధిగమించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు.



కొవ్వూరు పట్టణంలో కురుస్తున్న వర్షం

వర్షంతో ప్రజల అవస్థలు

కొవ్వూరు, సెప్టెంబర్ 27: కొవ్వూరు పట్టణ, మండలంలో శుక్రవారం ఉదయం నుంచి పడుతున్న వర్షంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పట్టణంలోని పలు గుంతల్లో వర్షం నీరు చేరడంతో ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పల్లపు ప్రాంతాలలో వర్షం నీరు చేరడంతో ముంపునకు గురయ్యాయి. కొవ్వూరు పట్టణ పోలీస్ స్టేషన్ వెళ్లే రహదారి, ఫైర్‌స్టేషన్, తహశీల్దార్ కార్యాలయ ప్రాంగణాల్లో వర్షం నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.



సేకరించిన విరాళాలను ఎమ్మెల్యే ముప్పిడికి అందజేస్తున్న నాయకులు

వరద బాధితులకు విరాళం

చాగల్లు, సెప్టెంబరు 27: వరద బాధితుల సహాయార్థం మండలంలోని చిక్కాల గ్రామ టీడీపీ, కూటమి నాయకులు రూ.60,6666 విరాళాలు సేకరించారు. టీడీపీతో పాటు కూటమి నాయకులు, గ్రామస్థుల నుంచి సేకరించిన విరాళాలను శుక్రవారం కొవ్వూరులో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విరాళాలు ఇచ్చిన వారిని అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆళ్ళ హరిబాబు, నాదెళ్ళ శ్రీరామ్, యంత్రప్రగడ అబ్బులు చౌదరి తదితరులతో పాటు పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రజల శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయం

కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, సెప్టెంబర్ 27: ప్రజల శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయమని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. వరద బాధితులకు తక్షణసాయం కింద రూ.602 కోట్లు అందించడం ఒక చరిత్ర అన్నారు. కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో శుక్రవారం పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటీవల భారీ వర్షాల వల్ల విజయవాడలో పలు ప్రాంతాలు ముంపునకు గురి కావడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు కలెక్టరేట్ కార్యాలయాన్ని సీఎంవోగా చేసుకుని రాత్రింబవళ్ళు కష్టపడ్డారన్నారు. విపత్తు సంభవించిన 20 రోజులు తిరక్కుండానే వరద నష్టాన్ని అంచనా వేయడమే కాకుండా, బాధితులకు రూ.602 కోట్ల సాయాన్ని అందించడం ఒక చరిత్ర అన్నారు. అనంతరం చాగల్లు మండలం చిక్కాల గ్రామస్తులు వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.6,06,666 చెక్కును ఎమ్మెల్యేకు అందజేశారు. కార్యక్రమంలో మద్దిపట్ల శివరామకృష్ణ, శ్రీరామ్, హరిబాబు, అబ్బులుచౌదరి, కలకంటి రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.



బదిలీపై వెళుతున్న వారిని సన్మానిస్తున్న తహశీల్దార్ మెరికమ్మ

ప్రజలు గుర్తుంచుకునేలా అధికారులు పనిచేయాలి

చాగల్లు, సెప్టెంబరు 27: విధి నిర్వహణలో ప్రజలకు అందించిన సేవలే అధికారులకు మంచి గుర్తింపు, గౌరవం తీసుకొస్తాయని తహశీల్దార్ ఎం.మెరికమ్మ అన్నారు. చాగల్లు తహశీల్దార్ కార్యాలయం నుంచి బదిలీపై వెళుతున్న సందర్భంగా డీటీ నిరంజన్, రీసర్వే డీటీ ఆనంద్‌లను ఆమెతో పాటు సిబ్బంది సన్మానించారు. వారు కొవ్వూరు తహశీల్దార్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. గ్రామ రెవెన్యూ అధికారులు ఊనగట్లకు చెందిన బి.భాగ్యలక్ష్మి దేవరపల్లి మండలం దుద్దుకూరుకు, చంద్రవరంలోని బి.రాంబాబు నిడదవోలు మండలం పురుషోత్తపల్లికి, చిక్కాలకు చెందిన సాయి సతీష్‌రాజ్ తాళ్ళపూడి మండలం పోచవరంకి బదిలీ అయ్యారు. వీరిని కూడా సత్కరించి వీడ్కోలు పలికారు.

బదిలీపై వెళుతున్న సబ్‌రిజిస్ట్రార్‌కు వీడ్కోలు

తాళ్లపూడి, సెప్టెంబరు 27: వేగేశ్వరపురం సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న ఎస్‌కె మౌలానా బదిలీ అయిన సందర్భంగా ఆయనకు సిబ్బంది వీడ్కోలు తెలిపారు. ఇటీవల బదిలీల్లో భాగంగా వేగేశ్వరపురం సబ్‌రిజిస్ట్రార్ మండపేటకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా డాక్యుమెంటు రైటర్లు, సిబ్బంది ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో గుండా రామకృష్ణారావు, ఆకుల గణేష్, వారణాసి రవికృష్ణ, మారిశెట్టి వీరపండు తదితరులు పాల్గొన్నారు.



సబ్ రిజిస్ట్రార్‌కు వీడ్కోలు పలుకుతున్న సిబ్బంది, డాక్యుమెంట్ రైటర్లు

నన్నయలో నేడు తెలుగు జాతీయ సదస్సు

దివాన్‌చెరువు, సెప్టెంబరు 27: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, స్ఫూర్తి కుటుంబం సంయుక్త ఆధ్వర్యంలో నేడు తెలుగు జాతీయ సదస్సు జరుగుతుందని సదస్సు కన్వీనర్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తెలుగుశాఖ సహాయ ఆచార్యుడు తరపట్ల సత్యనారాయణ తెలిపారు. ప్రారంభ సభకు ముఖ్య అతిథిగా వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు, విశిష్ట అతిథిగా నాగార్జున విశ్వవిద్యాలయం పూర్వ రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి, అతిథులుగా మద్రాస్ విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అధ్యక్షులు ఆచార్య విస్తాలి శంకర్, యోగి వేమన విశ్వవిద్యాలయం కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎస్.ఈశ్వరరెడ్డి స్ఫూర్తి కుటుంబం అధర్ వి.సదాశివరావు, సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల సహాయ ఆచార్యులు తాతా దీప్తి ప్రసన్న హాజరై ప్రసంగిస్తారన్నారు. అదేరోజు సాయంత్రం జరిగే ముగింపు సభకు రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు. వివిధ ప్రాంతాల నుంచి సదస్సు ప్రతినిధులు హాజరవుతున్నారని సత్యనారాయణ అన్నారు.

తహశీల్దార్ కార్యాలయ సూపరింటెండెంటుగా నాయుడు

కొవ్వూరు, సెప్టెంబర్ 27: కొవ్వూరు తహశీల్దార్ కార్యాలయ సూపరింటెండెంటుగా ఎస్‌వీఎస్ నాయుడు బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన కె.అజయ్‌బాబు గోపాలపురం తహశీల్దార్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఉండి తహశీల్దార్ కార్యాలయ డిప్యూటీ తహశీల్దార్ ఎస్‌వీఎస్ నాయుడు బదిలీపై కొవ్వూరు వచ్చారు. కొవ్వూరు తహశీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న కె.రామకృష్ణ తాళ్ళపూడి, ఎన్నికల డీటీఎం కమల్ సుందర్ చాగల్లు రీసర్వే డీటీగా, కొవ్వూరు రీసర్వే డీటీ సాంబశివరావు గోపాలపురం, కొవ్వూరు ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ జి.హేమ రాజమహేంద్రవరం కలెక్టరేట్‌కు బదిలీ అయ్యారు. చాగల్లు తహశీల్దార్ కార్యాలయం నుంచి కొవ్వూరు ఎన్నికల డీటీగా కె.నిరంజన్, రీసర్వే డీటీగా కె.ఆనంద్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్‌గా కె.ఆర్.పురం నుంచి జి.నాగేంద్ర కొవ్వూరు వచ్చారు.

కొవ్వూరు సబ్ రిజిస్ట్రార్‌గా సుందరరావు



కొవ్వూరు, సెప్టెంబర్ 27: కొవ్వూరు సబ్ రిజిస్ట్రార్‌గా కె.సుందరరావు బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసిన ఈ.వెంకటేశ్వరరావు అనంతపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో రాజమహేంద్రవరం పిడింగొయ్యి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి కె.సుందరరావు కొవ్వూరు సబ్ రిజిస్ట్రార్‌గా బదిలీపై వచ్చారు. కొవ్వూరులో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ పోలవరం, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్‌లు నిడదవోలు, ఒక జూనియర్ అసిస్టెంట్, అటెండర్ జంగారెడ్డిగూడెం బదిలీపై వెళ్లారు.

భార్య, కుమారుడు కనబడటంలేదని పోలీసులకు ఫిర్యాదు

చాగల్లు, సెప్టెంబరు 27: భార్య, కుమారుడు కనబడటం లేదని మండలంలోని దారవరంకి చెందిన షేక్ మీరావలి ఫిర్యాదు మేరకు చాగల్లు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ కె.నరేంద్ర తెలిపిన వివరాల ప్రకారం ఇంటి నుంచి వెళ్లిన భార్య షేక్ సబీనా, కుమారుడు షేక్ అర్షు తిరిగి రాలేదన్నారు. వ్యవసాయ కూలీగా జీవనం సాగించే మీరావలి వారి కోసం పలు చోట్ల గాలించినా ఫలితం లేకపోయింది. పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

కొవ్వూరు, సెప్టెంబర్ 27: వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు కొవ్వూరు పట్టణ ఎస్ఐ కె.జగన్మోహనరావు తెలిపారు. కొవ్వూరు పట్టణానికి చెందిన సాజిపల్లి దుర్గారావు భార్య శేషమణి సమిశ్రమగూడెంలోని ఒక ప్రైవేటు జూనియర్ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. ఈ నెల 26న ఉదయం కళాశాలకు వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చేసరికి భర్త కనిపించకపోవడంతో పలుచోట్ల వెతికారు. ఫలితం లేకపోవడంతో పట్టణ పోలీసులకు శేషమణి ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నల్లజర్ల డీటీగా శాంతిప్రియ



నల్లజర్ల, సెప్టెంబరు 27: నల్లజర్ల డిప్యూటీ తహశీల్దార్‌గా వి.శాంతి ప్రియ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. దవళేశ్వరంలో ఉన్న పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ భూసేకరణ ప్రత్యేక కలెక్టర్ కార్యాలయంలో స్పెషల్ డిప్యూటీ తహశీల్దార్‌గా పనిచేసి బదిలీపై నల్లజర్ల వచ్చారు. ఇప్పటి వరకు నల్లజర్లలో డీటీగా పని చేసిన కిషోర్‌కుమార్ ఆకివీడు ఎలెక్షన్ డీటీగా బదిలీపై వెళ్ళారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డీటీ శాంతి ప్రియను వీఆర్వోలు, వీఆర్ఏలు, రెవెన్యూ సిబ్బంది పుష్ప గుచ్ఛం ఇచ్చి అభినందించారు.

ముంపు నివారణకు చర్యలు తీసుకోవాలి: సీపీఐ

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 27: రాజమహేంద్రవరంలో ముంపు నివారణకు సిటీ ఎమ్మెల్యే మునిసిపల్ కమిషనర్ చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సీపీఐ నాయకులు నగరంలోని లోతట్టు ప్రాంతాలను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ కొద్దిపాటి వర్షం కురిసినా నగరంలో పలు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయన్నారు. ఈ పర్యటనలో సీపీఐ నగర కార్యదర్శి కొండలరావు, నాయకులు రామకృష్ణ, శ్రీనివాస్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

కొవ్వూరు

యువరాజ్‌మాల్ స్క్రీన్1	: సరిపోదా శనివారం
వై.స్క్రీన్2	: డిమొంటి
దేవిశ్రీ(గాయత్రి	: డబుల్ ఇస్మార్ట్
అనన్య	: ఆయ్

నిడదవోలు

వీ మ్యాక్స్	: దేవర
రాధాకృష్ణ	: దేవర
శ్రీగణపతి	: ఆయ్, కమిటీ కుర్రోళ్లు

దేవరపల్లి

శ్రీరామ్‌నాథ్ సినీ మ్యాక్స్	: మిస్టర్ బచ్చన్
త్రినాథ్ సినీ మ్యాక్స్	: డబుల్ ఇస్మార్ట్